
సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER
Read / Share / Fallow
www.leaderepaper.com
www.facebook.com
/leaderramanamurthy/
గురువారం • 11 జనవరి 2018 । సంపుటి : 20 సంచిక : 166 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad



మన విద్యాసంస్థల తీరుమారేనా?



- సెలబ్రేషన్లతో విద్యార్థులకు గాలం
- వ్యాపారాభావృద్ధికి కొత్త పోకడలు
- పసి మనసులపై విష ప్రభావం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: విద్యా వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి విద్యాసంస్థల యాజమాన్యాలు చేసే ప్రయత్నాలు ఇన్నీ అన్నీ కావు. మంచి మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా చదవమని ఒత్తిడి చేస్తారు. ప్రాజెక్టులు, క్రీడలు, కళలు వీటిలో కూడా ఎవరికీ తీసిపోమంటూ చాటుకోవడానికి యథాశక్తి ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కులు, ర్యాంకులు, క్రీడలు, యోగా వంటివి చెప్పి తల్లిదండ్రులను ఆకట్టుకోవడంతో పాటు, నేరుగా విద్యార్థులను ఆకట్టుకోవడానికి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. కొత్త పోకడలతో విద్యార్థులకు గాలం వేస్తున్నారు. ఏదో ఒక పేరు చెప్పి స్కూళ్ళలో వినోదం పేరిట కార్యక్రమాలు నిర్వహించడం ఈ కోవకు చెందినదే.

సెలబ్రేషన్ పేరుతో విద్యార్థులకు గాలం

ప్రస్తుత కాలంలో చాలా విద్యాసంస్థల్లో ఫ్రెషర్స్ డే, ఆన్యువల్ డే, సెండాఫ్ డే, యూత్ ఫెస్టివల్ వంటి పేర్లతో విద్యార్థుల చేత వివిధ కార్యక్రమాలు చేయిస్తున్నారు. వినోదం పేరుతో మొదలయ్యే ఈ కార్యక్రమాలు ఆ పరిధులు దాటి వెర్రిపోకడలు పోతున్నాయి. విద్యార్థుల చేత విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టిస్తూ ఇష్టారాజ్యంగా ప్రోగ్రాంలు చేస్తున్నారు. సెలబ్రిటీలను ఆహ్వానించి మరీ ప్రోగ్రాంలు రక్తికట్టిస్తున్నారు. చదువు, విజ్ఞానం, శాస్త్రీయ, లలిత కళల వంటి అంశాల్లో పోటీలు నిర్వహించడం ఏనాడో పోయింది. ప్రస్తుతం డాన్స్ బేబీ డాన్స్, కిర్రాక్ డాన్స్‌ల ట్రెండ్ నడుస్తోంది. డబుల్ మీనింగ్ సాహిత్యంతో పాటలు, అసభ్యకర చేష్టలే భంగిమలుగా డాన్సులు, చెవులు బద్దలయ్యే శబ్దాలు, కళ్ళు చెడిపోయేలా లైట్లు ఇవీ ప్రస్తుతం ఏదైనా కాలేజీ ఫంక్షన్‌కి వెళితే మనకి తారసపడేవి. అంతేకాక వీటికోసం ప్రాక్టీసు, రిహార్సిల్స్ వంటి వాటితో విద్యార్థుల విలువైన సమయం వృధా అవుతోంది. విద్యార్థులు ఇటువంటి వాటి వైపు వెళుతూంటే వారించి చెప్పవలసిన యాజమాన్యాలే స్వయంగా ఇటువంటి వాటిని నిర్వహిస్తూ మరింత ప్రోత్సహించడం దురదృష్టకరం. పూర్వం క్లబ్బుల్లో మాత్రమే ఇటువంటివి జరిగేవి. అక్కడ కూడా పిల్లలను అనుమతించేవారు కాదు. కాని ప్రస్తుతం పిల్లలు చదివే స్కూళ్ళు, కాలేజీల్లోనే ఇటువంటివి జరగడం చూస్తే ప్రపంచం ఎటుపోతోందో అర్థం కాని పరిస్థితి.

కౌమారదశపై దుష్ప్రభావం

అప్పుడే కౌమార దశలో అడుగుపెడుతున్న బాలబాలికలపై ఈ తరహా కార్యక్రమాలు ఎంత చెడు ప్రభావం చూపిస్తాయని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మా కాలేజీ యూత్ ఫెస్టివల్‌కి ఫలానా సినిమా స్టార్ అతిధిగా వస్తున్నారంటూ

మిగతా 2లో ▶

గ్రామీణుల సంతృప్తి నామమాత్రమే..!

అభివృద్ధి అంతంతమాత్రమేనా..?

విద్యార్థులను భాగస్వామ్యం చేయనున్న ప్రభుత్వం

న్యూస్‌లీడర్ @ అమరావతి

గ్రామాల్లో జరుగుతోన్న అభివృద్ధి కార్యక్రమాలపై అక్కడి ప్రజలు నామమాత్రం సంతృప్తినే వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా అక్కడ జరుగుతున్న సమస్యల పరిష్కారం, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు పూర్తిస్థాయి సంతృప్తిని వ్యక్తం చేయడం లేదు. ఐవీఆర్ఎస్ ద్వారా అక్కడి మొబైల్ ఫోన్స్‌కు కాల్స్ చేస్తూ తీసుకుంటున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఈ అంశం తేటతెల్లమవుతున్నది. రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) సిబ్బంది రోజుకు

మిగతా 2లో ▶



కల్లుగీత కార్మికులకు ఉపశమనం

ఎక్సైజ్‌కు నిరుత్సాహం

న్యూస్‌లీడర్ @ అమరావతి



రాష్ట్రవ్యాప్తంగా కల్లు విక్రయించే కార్మికులు ఎటువంటి పన్నులు చెల్లించనవసరం లేదనే రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో కల్లు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నూతన కల్లు పాలసీపై ప్రభుత్వం జారీ చేసిన నూతన పాలసీలో 2022 వరకు అమలులో ఉంటుంది. ఈ పాలసీ ద్వారా పన్ను మినహాయించడంతో పాటు కల్లు విక్రయించుకునే సౌలభ్యం చెట్టు నుంచి 50 కిలో మీటర్ల నుంచి 100 కిలో మీటర్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. పన్నుల వసూలు ద్వారా రాష్ట్రంలో ఉన్న లక్షా ఆరు వేల మంది గీత కార్మికులకు ఏటా రూ.3.43 కోట్ల రూపాయల మేర చెల్లింపులు చేసేవారు. అయితే ప్రభుత్వానికి రూ.3.43 కోట్లు మాత్రమే వస్తున్నప్పటికీ పన్నులు పేరు చెప్పుకుంటూ ఎక్సైజ్ అధికారులు రూ.10 కోట్ల వరకు వసూలు చేస్తున్నారని పలువరు కల్లుగీత కార్మికులు లబోదిబోమంటున్నారు. పన్నులు ఎత్తివేయడం ద్వారా కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్ వారి నుంచి ఉపశమనం పొందుతారని పలువురు ప్రజాప్రతినిధులు సైతం చెబుతున్నారు. ఈ నిర్ణయ ఎక్సైజ్‌లో అక్రమవసూళ్లు చేసేవారు నిరుత్సాహం

మిగతా 2లో ▶

భక్తులకు గంటా దివ్యదర్శనం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: భక్తునికి భగవంతునికి మధ్య అనుసంధానం అంబికా దర్బారుబత్తి అని మనుకు ఇంతవరకూ తెలిసినవిషయం. కానీ భక్తునికి భగవంతునికి మధ్య అనుసంధానం చేసే 'గంటా ఇల్లు' అని తెలిస్తే అందరూ ముక్కునవేలేసుకుంటారు. ఇదిఅక్షరాల నిజం మరి! ముస్లీంలకు హజ్‌యాత్రలాగే హిందువులకు దివ్యదర్శనం పేరుతో ప్రభుత్వం తీర్ధయాత్ర పధకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఈసారి భీమునిపట్నం నియోజకవర్గం నుంచి రెండు వందల మందిని ఎంపిక చేసింది. బుధవారం ఉదయం వీళ్ళు

మిగతా 2లో ▶

జాయ్ అలుక్కాస్ షోరూంలపై ఐటీ దాడులు

చెన్నై: ప్రముఖ జువెలరీ సంస్థ జోయ్‌అలుక్కాస్‌కు చెందిన దుకాణాలపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. చెన్నైలోని పలు షోరూంలలో ఈరోజు ఉదయం నుంచి అధికారులు సోదాలు నిర్వహిస్తు న్నారు. పన్ను ఎగవేత ఆరోపణలపై అధికారులు దాడులు చేస్తున్నట్లు సమా చారం. అలాగే మంజలి జువెలర్స్ అనే సంస్థ దుకాణాలపైనా దాడులు చేస్తు న్నట్లు అధికారులు తెలిపారు. దక్షిణ భారతదేశంతో పాటు గుజరాత్, హరియా ణాల్లోని 130 ప్రాంతాల్లో ఐటీ దాడులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. జోయ్‌అలుక్కాస్‌కు భారత్ సహా 11దేశాల్లో షోరూంలు ఉన్నాయి. ఖతార్, ఒమన్, బహ్రెయిన్, యూకే, భారత్‌లలో కలిపి 130 షోరూంలు ఉన్నాయి.

హోండరస్‌లో భారీ భూకంపం

కరీబియన్ దీవుల్లో సునామీ హెచ్చరికలు జారీ

హోండరస్ : కరీబియన్ సముద్రంలో ఇవాళ భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.6గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. హోండరస్ కేంద్రంగా భూకంపం వచ్చింది. దీంతో అక్కడ సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సునామీ అలలు ప్యూర్టో రికోను తాకే

మిగతా 2లో ▶



జగమేమాయ!



మరేం ఫర్వాలేదు.. ఆధార్ ఆధారంగా నేరస్థుల్ని పట్టుకోవచ్చులే..!

హత్య కేసులో ముద్దాయి ఆత్మహత్యా యత్నం



విశాఖ క్రైం, న్యూస్‌లీడర్: భార్య హత్యను కేసులో 80 రోజులు జైల్లో ఉండి ఇటీవల బెయిల్ పై విడుదలైన మునస మహాలక్ష్మి అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుట కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. ప్రస్తుతం అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే... పెందుర్తి ప్రాంతానికి చెందిన మునస మహాలక్ష్మి అనే సెక్యూరిటి గార్డు తన భార్య రాజేశ్వరి ఇద్దరు పిల్లలతో పాత పెందుర్తిలో

మిగతా 2లో ▶

ఏసీబీ వలలో మరో అవినీతి చేప



హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ వలలో మరో అవినీతి చేప చిక్కింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న అభియోగంపై తిరుపతి ఎస్వీ వర్సిటీ అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్.రుద్రకుమార్ నివాసం సహా ఆయన సోదరి, సోదరుల ఇళ్లలో అనిశా విస్తృత సోదాలు చేస్తోంది. తిరుపతి, నెల్లూరులో ఉదయం 6 నుంచి ఆరు ప్రాంతాల్లో అనిశా అధికారుల బృందాలుగా విడిపోయి సోదాలు

మిగతా 2లో ▶

హత్య కేసులో ముద్దాయి ఆత్మహత్యా యత్నం

(మొదటి పేజీ తరువాయి)

నివాసం ఉంటున్నాడు. గత సంవత్సరం అక్టోబరు 13 న భార్య రాజేశ్వరితో ఈ వ్యక్తి గొడవపడి ఆమెను క్రికెట్ బ్యాట్‌తో తలపై బలంగా కొట్టడంతో ఆమె చనిపోయింది. పెందుర్తి పోలీసులు మహాలక్ష్మిని కోర్టులో హాజరు పర్చగా బెయిల్ పై విడుదలయ్యాడు. తరువాత ఆస్తిలో వాట ఇవ్వలని తండ్రిపై పిల్లలు, బంధువులు ఒత్తిడి చేయడం మొదలయ్యింది. మహాలక్ష్మి తమను కొట్టి గాయపరచినట్లు పిల్లలు పెందుర్తి పోలీసు స్టేషన్లో నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో పిల్లలు, అత్తింటి వారి నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో మహాలక్ష్మి బుధవారం ఉదయం పెందుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట వంటిపై కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. ఇది గమనించిన స్థానికులు మహాలక్ష్మిని చికిత్స కోసం 108లో కె.జి.హెచ్‌కు తరలించారు. పెందుర్తి సి.ఐ జె. మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణుల సంతృప్తి నామమాత్రమే..!

(మొదటి పేజీ తరువాయి)

25 నుంచి 30వేల మందికి కాల్స్ చేస్తున్నది. చేసినవారికి చేయకుండా అందరికి కాల్స్ చేస్తూ పారదర్శకమైన అభిప్రాయసేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే గ్రామాల్లోని అభివృద్ధి, జన్మభూమి-మావూరులో సమస్యల పరిష్కారంపై రమారమి 50 శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంటే సగంమంది నిర్మొహమాటంగా గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని, జన్మభూమి కార్యక్రమంలో సమస్యలు పరిష్కారించడం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుమారుడు నారా లోకేష్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న తరుణంలోనే గ్రామాల అభివృద్ధిపై 80 శాతమైనా ప్రజల నుంచి సంతృప్తి చెందకపోవడంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. గ్రామాలపై మరింత పక్కా ప్రణాళికలతో చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. నెలకొకసారి విద్యార్థులు గ్రామాల్లో పర్యటించాలని, అక్కడ నెలకొన్న సమస్యలు వాటికి తగిన పరిష్కారాలని సూచించాల్సి ఉంటుందని నిర్ణయించారు. అభివృద్ధి జరుగుతోన్న పనుల తీరుతో పాటు ప్రజల్లో వాటిపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు శ్రమించాల్సి ఉంటుంది. ఎల్ఈడీ వీధి దీపాలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్లు, నరేగా నిధులతో అంగన్‌వాడీ, గ్రామాలకు సంబంధించిన భవనాలు నిర్మిస్తున్నా గ్రామీణుల్లో పూర్తిస్థాయిలో సంతృప్తి రావడం లేదు. దీంతో క్షేత్రస్థాయిలో మరింత పరిశీలన జరిగేందుకు విద్యార్థుల ద్వారా మెరుగైన ఫలితాలు పొందాలని ప్రభుత్వం భావిస్తోంది.

మన విద్యాసంస్థల తీరుమారేనా?

(మొదటి పేజీ తరువాయి)

గొప్పగా ప్రకటనలు చేస్తున్న విద్యా వ్యాపారవేత్తల చేతిలో చిన్నారుల భవిత ఎటు పోతుందో ఆలోచించుకోవడం తల్లిదండ్రుల వంతైంది. ఏమి మంచో ఏది చెడో నిర్ణయించుకోలేని వయసులో విద్యార్థులు ఇటువంటి వాటికి ఆకర్షింపబడడం సహజం. విద్యాబుద్ధులు నేర్పవలసిన చోట పెడత్రోవ పట్టించేలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రస్తుతం విద్యాలయాల దుస్థితికి నిదర్శనం.

నాటి కార్యక్రమాలే ఆదర్శం

పూర్వం విద్యాసంస్థల్లో ఏదైనా సందర్భం వస్తే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. వ్యాసరచన, వక్తృత్వం, జ్ఞాపకశక్తి, క్రీడలు వంటి అంశాల్లో పోటీలు పెట్టి, బహుమతులు ఇచ్చేవారు. దేశభక్తిని ఇనుమడింపజేసేవి, సందేశాత్మకమైన నాటికలు, బృందగానం, శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి కార్యక్రమాలు అలరించేవి. అతిథులుగా మేధావులను, విద్యావేత్తలను ఆహ్వానించేవారు. వారి ఉపన్యాసాలతో విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలిగేది. ఇప్పుడు పరిస్థితి ఎంత దిగజారిందంటే ఒకప్పుడు ఇటువంటివి జరిగేవనే విషయం కూడా నేటి విద్యార్థులకు తెలియని పరిస్థితి నెలకొంది.

విద్యాసంస్థల్లో న్యూ ఇయర్ డే ఎందుకు?

ఉన్నవి చాలనట్టు న్యూ ఇయర్ డే ని కూడా ఇటీవల కాలేజీల్లో, స్కూళ్ళలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. లక్షలు ఖర్చుపెట్టి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. డాన్సర్లను, సింగర్లను బయటి నుంచి తెప్పించి మరీ ప్రోగ్రాంలు చేస్తున్నారు. చెవులు చిల్లుపడేలా శబ్దాలు, కళ్ళు బైర్లుకమ్మేలా లైట్లు, మోడరన్ డ్రెస్సుల పేరిట అర్ధనగ్న దుస్తులతో డాన్సుల సమ్మేళనంగా సాగే ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఇచ్చే సందేశం ఏమిటి? విద్యా కేలండర్ పరంగా డిశంబర్ 31, జనవరి 1కి ఎటువంటి ప్రాధాన్యతా లేదు. చదువుకు సంబంధించిన ఏ అంకానికీ అవి ఆరంభమూ కాదు, అంతమూ కాదు. అటువంటి వాటిని చేయడంలో యాజమాన్యం ఉద్దేశ్యం ఏమిటి? పోనీ కొత్త సంవత్సరం సందర్భంగా దురలవాట్లను మానుకోవడం, మంచి అలవాట్లను అలవరుచుకోవడం వంటి ప్రతిజ్ఞలు చేయిస్తారా అంటే అటువంటివి చేస్తారనే విషయం కూడా నిర్వాహకులకు బహుశా తెలిసి ఉండదు. విద్యార్థుల అభ్యున్నతికి పనికొచ్చే ఏదైనా సందేశాన్ని ఇచ్చే ప్రముఖుల ఉపన్యాసాలు ఉంటాయా అంటే అదీ ఉండదు. ఇక న్యూ ఇయర్ వేడుకల్లో ఏం జరుగుతుందంటే షరా మామూలే. పాటలు, డాన్స్‌లు, ఎట్సెట్రాలే. ఇటీవల విజయనగరం జిల్లాలోని ఒక స్కూల్లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాల కారణంగా మితిమీరిన కాంతి వల్ల విద్యార్థుల కళ్ళకు తీవ్ర సమస్యలు తలెత్తాయి. కర్నాటకలోని ఓ స్కూల్లో డాన్సుల కోసం వేసిన స్టేజి కూలడంతో కొందరు విద్యార్థులు మరణించారు. ఇలాంటివి చూస్తే ఉత్సాహం వెర్రితలలు వేస్తున్న వైనం స్పష్టంగా వెల్లడవుతోంది. విద్యార్థులకు సంబంధించినంతవరకు విద్యాసంస్థలంటే దేవాలయాలే. వీటిని అత్యంత పవిత్రంగా చూసుకోల్సిన బాధ్యత యాజమాన్యాలు గుర్తించాలి. ఎంతసేపూ చదువేనా పిల్లలకి వినోదం కూడా అవసరం అనుకోవడం సరైనదే. విద్యార్థులకు విజ్ఞానం అందిస్తూ, వినోదం, ఆహ్లాదం కలిగించే కార్యక్రమాలు అనేకం ఉన్నాయి. విద్యాసంస్థల్లో అటువంటివి చేస్తే విద్యార్థులకే కాదు సమాజానికి కూడా మేలు చేసిన వారవుతారు. అంతేకాని వినోదం పేరుతో చిన్నారుల మనసులపై విష ప్రభావం చూపే దుష్ట సంస్కృతికి ఇకనైనా యామాన్యాలు చరమగీతం పాడాలి.

హోండరస్‌లో భారీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం ఉందన్నారు. భూకంప కేంద్రం నుంచి సుమారు వెయ్యి కిలోమీటర్ల మేరకు సునామీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో కేమన్ దీవులు, జమైకా, మెక్సికో, హోండరస్, క్యూబా, బెలిజె, శాన్ అండ్రిస్, కోస్టారికా, పనామా, నికరాగ్వే, గాటేమాల దేశాలను సునామీ అలలు తాకే అవకాశాలున్నాయి. హోండరస్‌లోని బరాపటుకా తీరానికి 125.4 మైళ్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. సుమారు పది కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. ఇప్పటివరకు ఎటువంటి నష్టం జరిగినట్లు తెలియలేదు. వాస్తవానికి భూకంప తీవ్రత 7.8గా ఉన్నట్లు మొదట తెలిపారు. కానీ తర్వాత దాన్ని 7.6కు తగ్గించారు.

భక్తులకు గంటా దివ్యదర్శనం


(మొదటి పేజీ తరువాయి)

ఎక్కిన బస్సులను ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు, విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు జెండా ఊపి బయలు దేరనివ్వాలి. కానీ సదరుమంత్రికి అంత ఓపిక లేదు. అందుకని భీమునిపట్నంలో బయలుదేరిన అయిదు బస్సులను ఎంవీపీ కాలనీలో తన ఇంటికే మంత్రి రప్పించుకున్నారు. పాపం! భక్తులు ఉదయాన్నే బయలుదేరి దేవుడిగుడిలోనే దివ్యదర్శనం చేసుకుంటామని భావించారు. కాని బస్సులు తిన్నగా వెళ్ళి గంటా ఇంటిముందు వాలాయి. అక్కడ మంత్రి జెండా ఊపితేగాని బస్సులు సింహాచలం బయలుదేరలేదు.

యాత్ర వివరాలివి..

దేవాదాయశాఖ ఉద్యోగి, యాత్ర ఇన్‌చార్జ్ రాంబాబు యాత్ర వివరాలు తెలుపుతూ మొదటిరోజు సింహాచలం, ద్వారకా తిరుమల దర్శించుకుని రాత్రికి ద్వారకా తిరుమలలో బసచేసి 11వ తేదీ ఉదయం పెదకాకాని శివాలయం చూసుకుని రాత్రికి శ్రీకాళహస్తి చేరుకుంటారన్నారు. 12వ శ్రీకాళహస్తిలో బయలుదేరి తిరుచాపూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఆరాత్రికి తిరుపతికి చేరుకుంటారన్నారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనం, మొక్కులు తీర్చుకుని అనంతరం 13వ తేదీ తిరుగు ప్రయాణమవుతారన్నారు. నెల్లూరు చేరుకుని కామాక్షి అమ్మవారిని దర్శించుకుని రాత్రికి విజయవాడ చేరుకుంటారన్నారు. రాత్రికి విజయవాడలో బసచేసి మరుసటిరోజు యాత్ర అన్నవరం చేరుకుంటుందన్నారు. అనంతరం అనకాపల్లి నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని రాత్రికి భీమిలి చేరుకుంటారని తెలిపారు. ఉచితప్రయాణంతోపాటు, అల్పాహారం, భోజనం, వసతి అన్ని సౌకర్యాలు భక్తులకు ప్రభుత్వం ఉచితంగానే ఏర్పాటు చేసిందన్నారు.

'కొడకా కోటేశ్వరరావు' పాటను తొలగించాలి



విశాఖపట్నం న్యూస్ లీడర్: పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'అజ్ఞాతవాసి' లో 'కొడకా కోటేశ్వరరావు' పాటను సినిమా నుండి తొలగించాలంటూ విజయవాడకు చెందిన ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. నామాల కోటేశ్వర రావు అనే పేరు గల ఈ లాయర్ సదరు పాట వల్ల తనకు, అలాగే కోటేశ్వర రావు అనే పేరుగల వాళ్ళకి అవమానకరంగా ఉందంటూ మాచవరం పోలీస్ స్టేషన్‌లో సినిమా రిలీజ్‌కు కొన్ని గంటల ముందు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ పాట ద్వారా తనను అటపట్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సినిమా కోసం పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ స్వయంగా పాడిన ఈ పాట విషయంలో పోలీసులు చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పాటను కాని, లేదా 'కోటేశ్వర రావు' అనే పదాన్ని కాని తొలగించిన తరువాతే సినిమాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ ఎక్స్‌పెక్టేషన్స్‌తో 560 థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ స్వయంగా పాడిన పాటను తొలగించాలన్న లాయర్ ఫిర్యాదు వల్ల ఏం జరుగుతుందో వేచి చూడాలి.

ఏసీబీ వలలో మరో అవినీతి చేప

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. తిరుపతి లక్ష్మీ శ్రీనివాస నగర్‌లోని రుద్రకుమార్ ఇంట్లో, ఎస్వీయూ ఇంజినీరింగ్ విభాగ కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. తిరుపతిలోని రుద్రకుమార్ ఇద్దరు సోదరుల ఇళ్లలోనూ అధికారుల బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తిరుపతి ఎస్వీయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్‌లోని రుద్రకుమార్ సోదరి ఇంట్లో సహా, నెల్లూరులోని రుద్రకుమార్ బావమరిది ఇంట్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. రుద్రకుమార్‌పై అనేక అవినీతి, అక్రమార్జన ఆరోపణలు రావడంతో ప్రాథమిక ఆధారాలు సేకరించిన అనిశా అధికారులు ఏకకాలంలో సోదాలకు చేపట్టారు. రుద్రకుమార్ పేరిట సహా సోదరులు, సోదరి పేరిట బినామీ ఆస్తులను కనుగొన్నారు. పట్టుబడిన చర ,స్థిర ఆస్తులు, బంగారు, వెండి ఆభరణాల విలువను మదింపు చేస్తున్నారు.

జగన్ పాదయాత్రలో ఎన్నారై దంపతులు

చిత్తూరు : ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో తాము సైతం అంటూ ఓ ఎన్నారై జంట పాల్గొంది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న పాదయాత్రలో బుధవారం జగన్‌తో కలిసి ఎన్నారై దంపతులు అడుగులు కలిపారు.

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లెకు చెందిన హరిప్రసాద్, సరిత దంపతులు ప్రజాసంకల్పయాత్రలో పాల్గొని తమ అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నారై దంపతులు మాట్లాడుతూ...వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. పాదయాత్ర ద్వారా ఆయన ప్రజలకు మరింతగా చేరువ అవుతున్నారన్నారు. దీనివల్ల వైఎస్ జగన్ సమస్యలను స్వయంగా తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. ఏ రాజకీయ నాయకుడికి, సినిమా యాక్టర్‌కు లేని ప్రజాదరణ వైఎస్ జగన్‌కు ఉందన్నారు. అభిమానం అనేది మనసులో నుంచి రావాలని, అది తాము ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నామని అన్నారు.

ఆయన పాదయాత్ర ద్వారా రెండు కోట్ల మందిని కలవడం సంతోషకరమన్నారు. ప్రజలు ఆయనను దగ్గర నుంచి చూస్తున్నారని, తమ సమస్యలు పరిష్కరించే వ్యక్తి వైఎస్ జగనే అని ప్రజలు నమ్ముతున్నారన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ నాయకత్వం ఎంతైనా అవసరం అని ఎన్నారై దంపతులు అన్నారు. యూఎస్‌లో కూడా చాలామంది వచ్చి మమ్మల్ని కలుస్తుంటారని, వైఎస్ఆర్‌సీపీకి ఉన్న పట్టు మరే పార్టీకి లేదన్నారు. ఏపీలో ఎటు చూసినా అవినీతే కనిపిస్తుందన్నారు. వైఎస్ జగన్ మమ్మల్ని ఆప్యాయంగా పలకరించారని హరిప్రసాద్ దంపతులు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు ఉపశమనం

(మొదటి పేజీ తరువాయి)

పడకతప్పదని కూడా అంటున్నారు. యధేచ్ఛగా కల్లు అమ్ముకునేందుకు ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. కల్లుతీసే సమయంలో చెట్టు మీద నుంచి పడి గాయపడి అంగవైకల్యం ఏర్పడిన గీత కార్మికులకు వయస్సుతో నిమిత్తం లేకుండా, వికలాంగులకు అందజేసేవిధంగా పెన్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. గీత కార్మికులందరికీ ప్రభుత్వం చంద్రన్న బీమా వర్తింపజేస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెరువులు, కాలువల గట్ల మీద తాటి చెట్ల పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అమలు చేసిన ఆదరణ పథం కింద గీత కార్మికులకు ప్రభుత్వం సైకిళ్లు అందజేసింది. ఈ ఆదరణ పథకం కింద గీత కార్మికులకు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాలతో పాటు చెట్లు ఎక్కడానికి యంత్రాలను కూడా పంపిణీ చేయనుంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి తడ వరకూ ఉన్న 990 కిలో మీటర్ల మేర సముద్ర తీరం వెంబడి తాటి చెట్ల పెంపకాన్ని జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటవీశాఖ, హార్టీకల్చర్ తో పాటు వనసేవా సమితి ఆధ్వర్యంలో తాటిచెట్ల పెంపకం చేపట్టాలని భావిస్తోంది. గుంతలు తవ్వడం, తాటి మొక్కలు నాటడం, అయిదేళ్ల పాటు వాటికి నీరు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించింది.

12న సీతారామచంద్ర స్వామి కల్యాణం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : బహుళ ఏకాదశిని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో 12న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి జ్యోతీమాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణంలో పాల్గొన దలచిన వారు రూ.300లు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవలసిందిగా ఆమె కోరారు.

12న వాజీ ముగ్గుల పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న ఎండీ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: గత 4సంవత్సరాలుగా ప్రతి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వాజీ ఛానెల్ నిర్వహిస్తున్న రంగుల రంగవల్లి రంగిలి (ముగ్గుల పోటీ) పోటీలను ఈ నెల 12వ తేదీన ఎంవీపీ కోలని ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత జి.శ్రీనివాసరావు తెలియచేశారు. వాజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని, గతంలో తెలుగమ్మాయి వంటి కార్యక్రమాలు నిర్వహించి తెలుగింటి ఆచార సాంప్రదాయాల విలువులను తెలియచెప్పామని అన్నారు. అంతేకాకుండా విజయనగరం జిల్లాలో గడిచిన 27 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాదరణ పొందామని చెప్పారు. విశాఖలో తమ సంస్థ ప్రారంభించిన అనతికాలంలోనే విశేషప్రేక్షకాదరణ లభించిందని అన్నారు. తాము చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రంగోలి పోటీలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నామని, ఆశక్తి గల మహిళలు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. మొదటి బహుమతిగా అరతులం బంగారు చెవిదిద్దులు, రెండు, మూడు, నాల్గవ బహుమతులుగా ఖరీదైన గృహోపకరణాల వస్తువులతో పాటుగా కన్సలేషన్ బహుమతులను అందించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 0891 272445, 2734445 ఫోన్ నంబర్స్‌ను సంప్రదించాలని కోరారు.

మత్స్యకారులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

15వ రోజుకు చేరిన రిలేనిరహార దీక్షలు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మత్స్యకారులు ఎదగాల్సిఅవసరం వుందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు గొల్ల బాబురావు అన్నారు. మత్స్యకార ఎస్టీ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరహార దీక్షలు బుధవారం 15వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు దీక్షకు మద్దతుగా గొల్లబాబురావుతో పాటు మరికొంతమంది సంఘీబావం తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాజ్యంగ నిర్మాత , మహానీయుడు బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లు ఇప్పిటికి నోచుకోని అణగారిన వారిలో మత్స్యకారుల ఒకరని అన్నారు. దేశంలో 80 శాతం మంది అణగారిన కులాలకు చెందిన వారు వుంటే కేవలం 20 శాతం అగ్రకులాలు పాలన సాగిస్తూ ఇతర కులాలను అణగదొక్కుతున్నారన్నారు. ఎస్టీ సాధన సమితి కన్వీనర్ మూగి శ్రీరామమూర్తి మాట్లాడుతూ తమకు సంఘీబావం తెలియజేసిన వారందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తమకిచ్చిన హామిలను తక్షణమే అమలు చేసి ఎస్టీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్, మత్స్యకార నాయకులు నీలకంఠం మాట్లాడుతూ తమ ఉద్యమాన్ని ఉధృతం చేయకముందే తమకిచ్చిన హామీను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ



దీక్షలో మాట్లాడుతున్న వైసీపీ నేత బాబూరావు

కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడ్ల బాస్కర్ రెడ్డి, పేడ్ల విజయచంద్ర, మాజీ మేయర్, బీజేపీ నాయకులు పులుసు జనార్ధన్, వాసుపల్లి కృష్ణయ్య, బర్రి కొండబాబు, కంటుముచ్చు తాతారావు, గంటా పాపారావు, డి. రామకృష్ణ, మూగి సూర్యనారాయణ, మూగి రాముడు, తిరుపతి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4న నాద శక్తి రాగ సాగర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నాద చికిత్స కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 4వ తేదీన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మైసూర్ అవధూత దత్తపీఠ వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీ 'నాద శక్తి రాగ సాగర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ట్లు అవధూత దత్తపీఠం (మైసూరు) అఖిలభారత సేవాసంఘం వ్యవస్థాక అధ్యక్షులు నారాయణరావు, గణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ ట్రస్ట్ నిర్వాహకులు ఎం.ఎస్.ఆర్.కె మూర్తి, ఎం.ఆంజనేయ రాజు, ట్రస్ట్ నిర్వాహకులు ఎం.వి.ఆర్.వి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం ద్వార కానగర్ పౌర గ్రంధాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివ రాలు వెల్లడించారు. ప్రాచీన నాద చికిత్స విధానంలో రాగ రాగినీ విద్య తెలిసిన వారిలో స్వామీజీ ఒకరన్నారు. తన గంభీరమైన స్వరంతో శ్రీ స్వామీ జీ భజనలు పాడి శ్రోతలను మైమరపింపచేసి వారి బాధలను ఉపశమింప చేస్తారన్నారు. తద్వారా వారి శారీరక, మానసిక అనారోగ్యాలను రూపుమాపడం జరుగుతోందన్నారు. దేశంలోని అనేక వైద్యశాలలు (హాస్పిటల్స్) స్వామివారి సంగీతాన్ని చికిత్సలో భాగంగా వినియోగించడం జరుగుతోందన్నారు.నాద చికిత్సలో భాగంగా ఫిబ్రవరి 4వ తేదీన సాయంత్రం 4.30 గంటల నుంచి ఉక్కునగరంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. విశాఖ వాసులకు ఇది మంచి అవకాశమని, దీనిలో పాల్గొని తరించాలని కోరారు. పూర్తిసమాచారం, ఉచిత ప్రవేశ పాస్‌ల కోసం 8328008448 నెంబరులో సంప్రదించాలని సూచించారు.నూతన సంవత్సరంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ తన తొలి కచేరీని చేయడానికి విశాఖ నగరాన్ని ఎంచు కోవడం మన అదృష్టమన్నారు. ఇటువంటి అరుదైనకార్యక్రమంలో పాల్గొనా లని కోరారు. కార్యక్రమంలో సి.పి రామారావు, డాక్టర్ భాగ్యారావు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న బీచ్‌రోడ్డులో శ్రీహనుమాన్ చాలీసా...

ప్రకృతి శాంతిని కాంక్షిస్తూ ఫిబ్రవరి 3వ తేదీన ఆర్.కె బీచ్‌వద్ద లక్ష మంది భక్తులతో హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తున్నట్టు గణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం ఎదురుగా సముద్ర తీరంలో ఈ బృహత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం మైసూర్ అవధూత దత్తపీఠ వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. లక్షమంది భక్తులతో హనుమాన్ చాలీసా పారాయణ చేయడం జరుగుతుందన్నారు. నగర ప్రజలు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని చరితార్థులు కావాలని నిర్వాహకులు కోరారు.

37వ వార్డులో జన్మభూమి మావూరు

కంచరపాలెం,న్యూస్‌లీడర్: జీవిఎంసీ 37 వార్డు పరిధి బాపూజీనగర్ గ్రామం కమ్యూనిటీ హాల్ లో జన్మభూమి మన ఊరు 5 వ విడత 9 వ రోజు జరిగింది. ఈ కార్యక్రమానికి 37 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జన్మ భూమి కమిటీ సభ్యులు అయిన గంకల అప్పారావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమం లో ముందు గా ప్రజలతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం టెలికాన్ఫెరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని వినిపించారు. అనంతరం గంకల అప్పారావు మాట్లాడుతూ సుపరిపాలన -టెక్నాలజీ వినియోగం విషయమై ప్రశంసించారు. ప్రజాసేవ సేవలో టెక్నాలజీ వినియోగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉందని, 20 వేల సీసీ కెమెరాలు అనుసంధానం చేసి ప్రభుత్వం శాఖల పని తీరును, సంక్షేమ పథకాల అమలు నేరు గా ముఖ్యమంత్రికార్యాలయం నుండి పర్యవేక్షణ 61 లక్షలకు పై గా ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం 1100 కాల్ సెంటర్ 2000 మంది ఉద్యోగులతో ప్రారంభించడమైనది .అంతేకాకుండా ఫైబర్ నెట్, కోర్ డాష్ బోర్డు ,గూగుల్ ఎక్స్ , ఆధార్ వేలిముద్ర తో లబ్ధి దారులకు నేరు గా రేషన్, ఫెన్షన్,ఉపాధి హామీ వేతనం , చంద్రన్న బీమా, సౌకర్యం కల్పించారు . మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు చేసిన కృషి ని కొనియాడారు . రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మన రాష్ట్రానికే



గర్వకారణమని అందుకు ఆయన చేస్తున్న కృషి మనం అందరం అభినందించాలి ఈ కార్యక్రమం లో జన్మ భూమి కమిటీ సభ్యులు జీవిఎంసీ సిబ్బంది ,డ్వాక్రా మహిళలు , గ్రామం సభ్యులు , అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిది

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా 31వ వార్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు బుధవారం వార్డు కార్యాలయం వద్ద బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో నేటి తరం వారు నాటి సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకూడదని ఇటువంటి కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. నాలుగేళ్ళుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ ఏడాది కూడా కొనసాగిందామన్నారు. ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వేదికగా ఈ కార్యక్రమాలు చేయడం ప్రజలతో మమేకం కావాలనే దృక్పథంతో చేపట్టామని తద్వారా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్థానిక సమస్యలను కూడా అధికారుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తుండడంతో వార్డులో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందని అన్నారు. పోటీలో ప్రథమ విజేత చిన్నికి రూ. 516, ద్వితీయ విజేత ఎం పార్వతికి రూ. 316, తృతీయ విజేత బిజాన్‌బేబీకి రూ.



116 బహుమతి గా అందజే యడంతో పాటు 25 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు రమణమ్మ, మధుర, మున్ని, లక్ష్మి, బోయిన గీత, తదితర వార్డు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: నగరంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనులను జీవిఎంసీ కమిషనర్ హరినారయణ్ పర్యవేక్షించారు. ఆదర్శనగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతపై ఆరాతీసారు. విస్తరణ, పనులు సక్రమంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అలాగే హనుమంతవాక జంక్షన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ నిర్మాణం, తదితర పనులను పరిశీలించారు. నూతనంగా వేస్తున్న బీటీ రోడ్ల పనులు తనిఖీ చేశారు. అలాగే జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న 105 అడుగుల పొడువు గల జెండా స్థూపాన్ని ఆయన పరిశీలించారు.





ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఐసీఏ ఏడూస్కిల్ కంపెనీ సెంటర్ మేనేజర్ జి. భాగ్యరాజ్ ప్రకటనలో తెలిపారు. ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, టూరిజం హాస్పిటాలిటీ సబ్జెక్టులలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 11వ తేది నుంచి మర్రిపాలెం సాయినగర్ సమీపంలో గల జ్యోతినగర్ వీధిలో గల తమ కార్యలయంలొ దరఖాస్తులు జారీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7901513701 నెంబరును సంప్రదించాలన్నారు.

12న యువజన దినోత్సవం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఈ నెల 12న యువజన దినోత్సవం నిర్వహించాలని విశాఖ వివేకానంద యువ మహా మండలి తీర్మానించింది. 12వ తేదీ సాయంత్రం 4గంటలకు యువచైతన్య ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు మునిస్వామి, కార్యదర్శి దేముడుబాబు, సంయుక్త కార్యదర్శి అప్పల రాజు, సోమరాజు, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, లక్ష్మినారాయణ తెలిపారు.

ఊరెళ్తున్నారా...జాగ్రత్త!



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: పండగ సెలవులు వచ్చాయి. .. స్కూళ్లకు హాలీడేస్ వచ్చేశాయి... ఇళ్లకు తాళాలువేసి సొంత ఊర్లకు, విహార యాత్రలకు వెళు న్నారా?.. అయితే కొంతమందికి దొంగల భయం ఉంటుంది... కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు మీ ఇళ్లు సురక్షితం అంటున్నారు నగర పోలీసు కమిషనరేట్ బాసులు. చాలా సందర్భాల్లో ప్రజలకు ఎన్ని ఉపాయాలు, చిట్కాలు, సూచనలు ఇచ్చినా వాటిని ఎవరూ పట్టించుకోకుండా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుండడంతోనే దొంగలు రెచ్చిపోతున్నారు. గతంలో, తాజాగా జరుగుతున్న దొంగతనాలు పోలీసులను కలవర పెడుతున్నాయి. కానీ ఈ వెకేషన్‌లో చోరీలు జరగకుండా ఉండేందుకు నగర పోలీసు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా మొబైల్ పెట్రోలింగ్, గల్లీ గస్తీని పెంచడంతో పాటు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నారు. చోరీల నివారణ కోసం ఇటీవల జైలు నుంచి విడుదలైన దొంగలపై దృష్టి పెట్టారు. అలాగే డే-హెబీ(పగటిపూట హౌజ్ బ్రేకింగ్), నైట్ హెచ్‌బీ(రాత్రిపూట జరిగే హౌజ్ బ్రేకింగ్) క్రిమినల్స్ కదలికలపై నజర్‌ను పెంచారు. గతంలో ఈ తరహా నేరాలకు పాల్పడ్డ ముఠాల సమాచారాన్ని సేకరిస్తున్నారు. వారి అనుచరుల వ్యవహారాలను పరిశీలిస్తున్నారు. పోలీసు కమిషనరేట్‌ల పరిధిలో పోలీసు అధికారులు ఆయా పోలీసు స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేశారు. వారి పరిధిలో ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అక్కడి స్థానికులతో అధికారులు చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాల షెడ్యూల్‌ను తయారు చేశారు. ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుని స్థానిక పోలీసు అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సెలవులో మీ ఇంట్లోకి దొంగలు చొరబడకుండా ఉండాలంటే పాటించాల్సిన పలు సూత్రాలను పోలీస్‌బాసులు ప్రత్యేకంగా రూపొందించారు. మీ ఇంటి వైపు దొంగల పడకుండా పోలీసు సూత్రాలను పాటించండి. నిర్లక్ష్యంతో తప్పులు చేయకండి. మీ కష్టార్జిత సొమ్మును దొంగల పాలు చేయకండి. కొంచెం తెలివిగా ఆలోచించి ఖరీదైన వస్తువులను భద్రంగా దాచుకోండి. చోరీలకు పాల్పడే దొంగలకు ఉచ్చు బిగుస్తున్నాం. ఇప్పటికే చాలా మందిని పీడీ యాక్ట్ కింద జైలుకు పంపాం. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి బస్తీలు, మురికివాడల్లో అద్దెకు ఉంటున్న వారి వివరాలను సేకరిస్తున్నాం. అనుమానాస్పదంగా చిత్తు కాగితాలను వేరుకుంటూ తిరిగే వారి వివరాలను సైతం సేకరించి భద్రపరుస్తున్నాం. క్రిమినల్ సర్వేలో సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నాం. అందులో నమోదైనవారి రోజువారి చర్యలపై ఆరా తీస్తున్నామంటున్నారు నగర పోలీసులు. ప్రధానంగా ఊరికి వెళ్లే వారు తమ ఇంటి ప్రధాన ద్వారానికి ఉండే కిటికీని తప్పనిసరిగా లోపలి నుంచి లాక్ వేయాలి. లేదంటే వాటిని తెరుచుకుని దొంగలు ఈజీగా చొరబడే అవకాశం ఉంటుంది. అదే విధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ప్రధాన ద్వారానికి ఇన్నర్ లాక్‌లను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, వాట్సప్ నెంబర్ 9493336633కు సమాచారం ఇవ్వండి అంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

- బయటకు కనిపించేట్లు తాళం వేయకూడదు.
- ఎక్కువ రోజులు ఊరికి వెళ్తే ఆ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలి.
- ఇంట్లో కాపలాకి ఎవరినైనా ఏర్పాటు చేసుకుంటే మంచిది.
- ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం ను ఏర్పాటు చేసుకోవాలి.
- అపరిచితులకు ఇంటి గుర్తులు చెప్పవద్దు.
- ఊరికి వెళ్తున్న సంగతి అపరిచితులకు చెప్పవద్దు.
- పేపర్, పాల పాకెట్లు బయట ఉంటే మీరు ఊర్లో లేనట్టు సులభంగా తెలుస్తుంది. ముందుగానే వాటిని మాన్పించండి.
- తాళం కప్ప వేసినంత మాత్రానా మీ ఇల్లు సేఫ్ కాదనే విషయాన్ని గుర్తుంచుకోండి.
- అపార్ట్ మెంట్లో ఉండే వాళ్లు ఖచ్చితంగా వాచ్ మెన్ ను ఏర్పాటు చేసుకోవాలి.
- సిసి కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- వీలైనంత వరకు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకపోవడం మంచిది ఊరికి వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఉంచడం మంచిది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: అప్పటి వరకు కూలి పనులు చేసుకుంటూ ఉపాధి కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్న వ్యక్తి ఏదో కొంచెం డబ్బులు వ్యవసాయం చెప్పి క్లీనర్‌గాబతుకు బాట సాగిస్తున్న సమయంలో ఒక్కసారిగా మృత్యు వెంటాడింది .స్థానిక సమాచారం మేరకు ఈగల తాతారావు (50) పెందుర్తి లో నివాసముంటున్నాడు .అయితే గత నెల వరకు అతను ఉపాధి రీత్యా కూలి పని చేసుకుంటుండేవారు . కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఉపాధి రీత్యా లారీ క్లీనర్‌గా గత నెల నుండి పని చేస్తున్నాడు .అయితే ఎప్పటి లాగే మంగళవారం అర్ధరాత్రి లారీలోడుతో పంజాబ్ హొటల్ వద్ద ఉన్న సాయినగర్‌లో అన్‌లోడ్ చేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన ఎర్త్ కారణంగా తాతారావు అక్కడికి అక్కడే మృతి చెందాడు . ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సమాచారం అందుకున్న బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ కేసును ఎర్పోర్ట్ జోన్ పోలీస్‌స్టేషన్ సిఐ , ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

ఆర్థికం అస్తవ్యస్థం

జీడీపీ పెరుగుతుందా? తరుగుతుందా? పెద్దనోట్ల రద్దుతో డిపాజిట్లు దక్షిణ భారతదేశంలో ఎందుకు తగ్గాయి? రూ.2వేల నోటు రద్దు చేస్తారా? చేయరా? ప్రజల ఆస్తులు ఎందుకు తగ్గాయి? బ్యాంకు శాఖలు మూసివేస్తారా? భారత్ ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందా? ఇలాంటివే అనేక ప్రశ్నలు. మరి కొద్దిరోజులలో కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. ఆర్థిక రంగం భవిష్యత్తు మీద అనేక సర్వేలు వెలువడుతున్నాయి. సమాచారం గుప్పిస్తున్నారు కాని విత్తం విపత్తును మాత్రం దాస్తున్నారు. అంచనాలు మారుతున్నాయి. అంకెలు గాడి తప్పి పాలకుల మీదకి రంకెలు వేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ అయోమయంలో పడింది. సగటు మనిషి సందిగ్ధంలో ఉన్నాడు. భారత్ ఆర్థిక భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. పారిశ్రామిక ప్రగతి పడిపోయింది. స్థూల జాతీయ ఉత్పత్తి బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా పెరగదని తేలిపోయింది. అభివృద్ధిపై అంచనా వేసే సంస్థలు, విశ్లేషకులు ఏడాది కాలంగా సవరణలు చేస్తూనే ఉన్నారు. సంజాయిషీలు ఇస్తూనే ఉన్నారు. మోడీ విధానాలను మోస్తూనే ఉన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్లనే ఆర్థిక వ్యవస్థకు ఆటంకాలన్నది మరుగున పడేస్తున్నారు. పెద్దనోట్ల రద్దుతో దేశమంతా డిపాజిట్లు 2శాతం పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ ప్రకటించింది. బ్యాంకులలో భారీ మొత్తంలో డబ్బులు చేరాయి. కానీ ఇందుకు విరుద్ధంగా దక్షిణ భారత రాష్ట్రాలలో డిపాజిట్లు తగ్గాయి. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో 4శాతం పైగా డిపాజిట్లు పడిపోయాయి. తెలంగాణలో రికార్డు స్థాయిలో డిపాజిట్లు 7.3 శాతం తగ్గడం ఆందోళనకరం. డిపాజిట్లు పురోగమన దశలో ఉండాల్సిన దక్షిణాదిలో తిరోగమన దశలో ఎందుకున్నాయని ప్రశ్నించుకోవాలి. బ్యాంకులలో దాచుకున్న డబ్బులు వినియోగదారుల అవసరాలకు ఆదుకోకపోవటం ఒక కారణం. రైతులు, చిరు వ్యాపారులు బ్యాంకుల దగ్గర లైన్‌లలో నిలబడి ఇచ్చినంత తెచ్చుకోవలసిన పరిస్థితి వచ్చింది. బ్యాంక్‌లో కంటే బయట ఉంటేనే అవసరాలకు అక్కరకొస్తాయని, బ్యాంక్‌లో జమచేయటం తగ్గి ఉండవచ్చు. బినామీల పేరుమీద డిపాజిట్ చేసిన నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవటం వల్లనైనా డిపాజిట్లు తగ్గి ఉండవచ్చు. కారణాలను సరిగ్గా కనిపెట్టాలి. ఇప్పుడు రెండువేల రూపాయల నోటును రద్దు చేస్తారనే చర్చ కొనసాగుతున్నది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పందించినా అనుమానపు మబ్బులు వీడలేదు. సందేహాలకు సమాధానం దొరకలేదు. రూ.2.46 లక్షల కోట్లు నోట్లు రిజర్వుబ్యాంక్ వద్ద ముద్రించి ఉన్నాయి. వాటిని చలామణీలోకి ఎందుకు తేవడంలేదో పాలకులకే తెలియాలి. వీటిస్థానంలో చిన్న నోట్లను ముద్రిస్తారని అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాల వలన ప్రజలు గందరగోళం పడకుండా చూడాలి. ఇందుకు పారదర్శకత చాలా అవసరం. కేంద్ర ప్రభుత్వం శీతాకాల సమావేశాలలో ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ ఇన్సూరెన్స్ బిల్లును తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇది చట్టంగా మారితే బ్యాంక్ డిపాజిట్లు తగ్గే ప్రమాదం పెరగవచ్చు. గతంలో ప్రభుత్వ బ్యాంకులలో వడ్డీ తగ్గించినప్పటికీ బ్యాంకులు బాధ్యతగా ఉంటాయని ప్రజలు డిపాజిట్ చేసుకున్నారు. బ్యాంకులో ఉంటే పెళ్ళిళ్ళ వంటి అవసరాలకు, వృద్ధాప్యంలోనూ పనికొస్తాయనే నమ్మకం ఉండేది. ఫైనాన్షియల్ బిల్లులోని 'బెయిల్ ఇన్' క్లాజు వల్ల డిపాజిట్లు మూలధనంగా మారుతాయి. బ్యాంకులు దివాళా తీస్తే డిపాజిట్ దారులు కూడా మునగాల్సిందే. ఈ క్లాజు మీద ఆర్థిక నిపుణులు కూడా అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసోచామ్ కూడా బెయిల్ ఇన్ క్లాజును ఎత్తివేయాలని కోరుతోంది. ఇప్పటికే నిరర్థక ఆస్తుల వలన బ్యాంకుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వరంగ బ్యాంకుల్ని దివాళా తీసే పరిస్థితి నుండి బయట పడేసేందుకు పాలకులు రూ.2.11 లక్షల కోట్లు రీక్యాపిటలైజేషన్ చేశారు. ఇదే అదునుగా సంస్కరణల కోసం రోడ్‌మ్యాప్ వేశారు. ఇప్పుడు నష్టాలు వచ్చే బ్యాంకులను మూసివేయం కానీ, ప్రతిభ ఆధారంగా మూలధనం ఇస్తాం అని చెబుతున్నారు. అంటే సంస్కరణలు అమలు చేయకుంటే పాలకులు చెప్పినట్లు వినకుంటే బ్యాంకులను దివాళా తీయిస్తారన్న మాట. మొదట బ్యాంకులను మూసివేయడం కాకుండా బ్యాలన్స్‌షీట్ ఆధారంగా నష్టాలు వచ్చే బ్యాంక్ శాఖలను మూసివేస్తామంటున్నారు. ప్రయివేటు బ్యాంకులకు పట్టం కట్టేందుకు అరుణ్‌జైట్లీ తాపత్రయం అంతా ఇంతా కాదు. కొన్ని బ్యాంకులలో డిపాజిట్లు వస్తాయి. కొన్ని శాఖలు రుణాలు ఎక్కువగా ఇస్తాయి. ఆ శాఖ పరిధిలో రుణాలు తీసుకోకపోతే లాభాలు రావు. లాభనష్టాలు బ్యాంక్ మొత్తంగా చూడాలి కానీ విడివిడిగా చూడటం సబబు కాదు. దేశంలో ఇన్‌కంటాక్స్ చెల్లించేవారు పెరుగుతున్నారని బడాయి కబుర్లు చెప్పారు. నిజమే కానీ, చెల్లింపుదారులు పెరిగారు, ఆదాయం తగ్గింది. పాలకుల మాటలు ప్రగల్భాలుగా మిగిలాయి. ఆర్థిక సంస్కరణల వలన ఒక్కశాతం ప్రజల దగ్గర 60శాతం ఆస్తి పోగుబడింది. ప్రజలు దివాళా తీస్తున్నారు. పేదరికం పెరుగుతోంది. కార్మికుల వేతనాలు పడిపోతున్నాయి. పాలనా పగ్గాలు ఎవరి చేతిలో ఉన్నా లాభపడేది ఆ ఒక్క శాతమేనన్నది అనుభవ సత్యం. సంస్కరణల వలన ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం అయింది. ప్రజలు ప్రత్యామ్నాయం వైపు పయనించాలి. ఆలోచించాలి.


ఉన్నత మానవ సంబంధాల చిరునామా
ఉమ్మడి కుటుంబం



కుటుంబ సంక్షేమం అంటే కుటుంబంలోని సభ్యులంతా ఆరోగ్యంగానూ ఆనందాగానూ ఉండడం మాత్రమే కాదు. వారి మధ్య చక్కని సంబంధాలు ఉంటేనే అది కుటుంబం అవుతుంది. అలా లేకపోతే దానిని కుటుంబం అనలేం. కొందరు మనుషులు అవసరాల కోసమో, పరిస్థితుల వల్లనో ఒకే చోట నివసించడం మాత్రమే అవుతుంది. మనదేశంలో కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది. అందునా ఉమ్మడి కుటంబాలంటే మరింత గొప్పవి. ఓ దంపతులకి పుట్టిన సంతానమంతా చిన్నప్పటి నుంచీ పెద్దయ్యి పెళ్లిళ్లయ్యి సంతానం కలిగి, ఆ పిల్లలకి పెళ్లిళ్లయిన తరువాత కూడా అందరూ కలిసి ఉండడం. ఇలా ఒకే ఇంటిలో దాదాపుగా ఓ 20 - 25 మంది దాకా కలిసి ఉంటే అది సమష్టి కుటుంబం అవుతుంది. ఒకప్పుడు మన దేశంలో సమష్టి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. ఇంకా చెప్పాలంటే మనదేశంలో మాత్రమే ఉండేవి. కాని కాల క్రమేణా ఇవి కనుమరుగవుతున్నాయి. ఇప్పుడు ఎక్కడైనా సమష్టి కుటుంబం ఉంటే ప్రత్యేకంగా చెప్పుకొనే విషయం అవుతోంది. అది కూడా కొద్దో గొప్పో పల్లెల్లో కనబడుతుంది కాని పట్టణాల్లో, నగరాల్లో ఉమ్మడి కుటుంబం ఉందంటే అది నిజంగా ఆశ్చర్యమే.

కొంత మందికి తమ కుటుంబ సభ్యులు వేర్వేరుగా, దూరంగా ఉండడం ఇష్టం ఉండకపోవడంతో కలిసి ఒకేచోట ఉండడం జరిగేది. అలాంటి వారికి తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి కూడా తోడైతే, ఇక బయటకు వెళ్లి ఉద్యోగాలు చేసే అవసరం ఉండదు. ఆ విధంగా కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా అదేచోట ఉండడం ద్వారా సమష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి. సమిష్టి కుటుంబాలు ఎక్కువగా జమీందార్లు, లేదా మంచి ఆర్థిక పరిపుష్టి కలిగిన వారిలో మాత్రమే కనబడేవి. ఇటువంటి కుటుంబాలలో ఉన్నవారు ఆస్తి వ్యవహారాలు చూసుకుంటూ ఉన్నచోటే ఉండిపోవడం అలవాటుగా మారిపోయింది. అయితే ఉమ్మడి కుటుంబాలు కేవలం గొప్పవాళ్లకే పరిమితమని చెప్పలేం. మధ్య తరగతివారిలో కూడా ఉమ్మడి కుటుంబాలు ఉంటాయి. అందరూ కలిసి సంపాదించుకుంటూ, కష్ట సుఖాల్ని పంచుకుంటూ, ఒకరి కోసం ఒకరు అనే విధంగా కలిసి మెలిసి ఉన్న కుటుంబాలు కూడా ఉండేవి. అనుబంధం ఆప్యాయతలే వీళ్ల మధ్య బలమైన బంధాలు. ఆ బంధమే వీళ్లందరినీ కలిపి ఒకేచోట ఉంచేది. వారివారి శక్తిని అనుసరించి, కొందరు సంపాదించడంలోను మిగిలిన వారు ఇంటిలో వ్యవహారాలను చూసుకుంటూ సమాజానికి ఒక ఆదర్శవంతమైన కుటుంబాన్ని అందిస్తున్నవారు కూడా ఉన్నారు. ఉమ్మడి కుటుంబాలు ఏర్పడ్డానికి కారణాలు ఏమైనప్పటికీ, అవి విచ్ఛిన్నం కావడానికి మాత్రం సవాలక్ష కారణాలుంటాయి. అందులో ప్రధానంగా కనపడేవి ఆర్థిక కారణాలు. ఎంత ధనవంతులకైనా మంది పెరిగే కొద్దీ ఆర్థిక సమస్యలు తప్పవు. ఆస్తిని అనుభవించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉండడంతో సమస్యలు మొదలవుతాయి. దీంతో సంపాదించవలసిన అవసరం ఏర్పడి ఉద్యోగాల కోసం బయటకు వెళ్లడం అనివార్యం అవుతుంది. ఆ విధంగా సంపాదన కోసం ఒక్కొక్కరూ బయటికి వెళ్లడం జరిగి చివరికి ఉమ్మడి కుటుంబం విడిపోవడానికి దారితీస్తుంది. ఒక్కొక్కసారి కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సభ్యుల మధ్య మనస్పర్థలు కూడా వాటికి జత కలుస్తాయి. కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు వచ్చి, వాటిని పరిష్కరించడంలో పెద్దలు విఫలమైతే అవి రాను రాను పెద్దవై చివరికి పెద్ద గొడవలకి దారితీస్తాయి. అలాంటి సందర్భాల్లో బంధువుల మధ్య ఆ మాత్రం సంబంధాలైనా నిలబడాలంటే కుటుంబం విడిపోవడం తప్ప వేరే గత్యంతరం ఉండదు. పైకి ఏ కారణాలు కనపడినా ఉమ్మడి కుటుంబాలు విడిపోవడానికి మానసిక కారణాలే ప్రధానమైనవి అనేది అందరూ ఒప్పుకోవలసినదే. ఎందుకంటే మనుషుల మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడు ఎన్ని కష్టాలొచ్చినా కలిసి ఉండేవారిని మనం చూస్తున్నాం. ఒక వేళ దూరంగా ఉండవలసి వచ్చినా వారి మధ్య అనుబంధాలు మాత్రం చెక్కుచెదరవు. అదేవిధంగా మనుషుల మధ్య కొద్దిపాటి పొరపొచ్చాలు ఉన్నపుడు ఆర్థిక సమస్యలు వస్తే అవి పెద్దవిగా మారతాయి. అంటే మూల కారణాలు మాత్రం అన్ని సందర్భాలలోనూ మానసికమైనవే అయి ఉంటాయి. ఎక్కువ మంది ఉండేచోట ఏదైనా లోటు వస్తే, తమ వరకూ ఐతే సర్దుకుపోగలిగిన వారు కూడ తమ పిల్లలకి అన్యాయం జరిగిందని వారికి అనిపిస్తే మాత్రం సహించలేరు. కొన్ని సందర్భాల్లో అది కేవలం వారి భ్రమ కూడా కావచ్చు. ఇలాంటివి తరచుగా జరిగితే ఆవేశాలను ఆపుకోలేక నోరు జారే ప్రమాదం ఉంటుంది. ఒక్క మాట చాలు మనసుల్ని గాయపరచడానికి. అలాగే పెళ్లిళ్ల కారణంగా కుటుంబంలోకి కొత్తవారు వచ్చి చేరడం, ఇక్కడి వారు బయటికి వెళ్లడం కూడా జరుగుతూ ఉంటుంది. ఈ కుటుంబ పద్ధతులు కొత్తగా వచ్చినవారికి నచ్చకపోవడం, లేదా ఆ వచ్చిన వారి పద్ధతులు ఈ కుటుంబానికి సరిపోకపోవడం వంటివి సాధారణం. ఇలాంటి వాటితో చిన్న చిన్నగా మొదలైన సమస్యలు చిలికి చిలికి గాలివానై కుటుంబాల్ని చీలుస్తాయి. పెద్ద కుటుంబాలు చాలా కాలంపాటు నిలవాలంటే ఇంటి పెద్ద మంచి పాలనా దక్షత కలిగినవాడై ఉండాలి. సమస్యలు ఉత్పన్నమైనపుడు అప్పటికి ఏదో సర్దిచెప్పి ఊరుకుంటే సరిపోదు. తరువాతైనా సరే సమస్యకి మూల కారణం తెలుసుకొని అవి శాశ్వతంగా పరిష్కారమయ్యేలా చూడాలి. లేకపోతే అదే అంశం మళ్లీ మళ్లీ తెరపైకి వస్తూంటుంది. ఇంటిలో అందరి మనోభావాలను గమనిస్తూ ఉండాలి. అందరి పట్లా ఒకే ప్రేమను కనబరచాలి. మృదువుగా మాట్లాడే అలవాటు వంద సమస్యలను నివారిస్తుంది. కాని అవసరాన్ని బట్టి ఒక్కొక్క సారి కఠినంగా ప్రవర్తించడం కూడా అవసరమే. తను తీసుకున్న నిర్ణయాలు అందరికీ నచ్చేవిగా ఉండాలి. లేదా నచ్చచెప్పి ఒప్పించాలి. ఎట్టి పరిస్థితుల్లోను ఎవ్వరినీ నొప్పించకుండా ఉండేలా జాగ్రత్త పడాలి. ఇంటిపెద్దగా అందరినీ శాసించే హక్కు తనకి ఉందనుకోవడానికి ముందే ఎవ్వరికీ అందరిని సమానంగా చూసే బాధ్యత ముఖ్యమని తెలుసుకోవాలి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే బాధ్యత అంటే ఏదో కొంత కాలం పాటు నెరవేర్చేది కాదు. తను ఉన్నంత కాలం బాధ్యతగానే ఉండాలి. సమస్యలు పునరావృతం అవుతూ ఉంటాయి. కొత్త సమస్యలు పుట్టుకొస్తూ ఉంటాయి. అన్నిటినీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాల్సిందే. అదే విధంగా కుటుంబ సభ్యులు కూడా ఇంటిపెద్ద చెప్పిన మాటను తప్పక ఆచరించాలి. ఎదిరించడం అనవసర అపోహలకు తావిస్తుంది. ఒకవేళ ఇంటిపెద్ద నిర్ణయం వల్ల ఏవైనా సమస్యలు వస్తాయని అనిపిస్తే, తన ఉద్దేశ్యాన్ని సమయం చూసి నెమ్మదిగా చెప్పాలి కాని ధిక్కారణ కూడదు. సమస్యలు వచ్చినపుడు అందరూ కూర్చుని మాట్లాడుకోవడం ఓ చక్కని పరిష్కారం. లేనిపోని ఆవేశాలకు లోను కాకుండా ఉండడం చాలా అవసరం. పూర్వం రోజుల్లో కుటుంబాలు వేర్వేరు చోట్లలో ఉన్నా, బంధువుల మధ్య సంబంధాలు మాత్రం బలీయంగా ఉండేవి. సమాచారాన్ని చేరవేయడానికి సరైన సదుపాయాలు లేని రోజుల్లో కూడా ఎక్కడో ఉన్న తమ వారికి ఓ ఉత్తరం రాసి యోగక్షేమాలు కనుక్కోవడం ఉండేది. అలాగే చుట్టాల దగ్గరి నుంచి ఉత్తరం కోసం ఎదురుచూడ్డం, వస్తే ఎంతో సంతోషపడడం, రాకపోతే కోప్పడ్డం వంటివి ఉండేవి. ఇప్పుడు క్షణాల్లో సమాచారం అందించే ఫోన్లు, ఈ మెయిళ్లు వంటి సాధనాలు ఎన్నో వచ్చాయి. వేల మైళ్ల దూరంలో ఉన్నవారితోనైనా క్షణాల్లో మాట్లాడవచ్చు. అయినా సంబంధాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. పూర్వ కాలంలో పెళ్లిళ్లయితే ఎక్కడెక్కడి నుంచో బంధువులు వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచే కాదు దూరపు బంధువులు కూడా వచ్చేవారు. ఇప్పుడు కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలే అంతంత మాత్రంగా ఉంటున్నాయి. రెండు తరాలు దాటినవారిని బంధువులుగా చెప్పుకోవడం లేదు. ఇక పిల్లలకైతే తమ కుటుంబంలోని వారిని తప్ప మిగిలిన వారు ఏ విధంగా బంధువులో వారిని ఏమని పిలవాలో కూడా తెలియడంలేదు. బంధువులంతా వేరు వేరు చోట్ల ఉన్నా వారందరి మధ్యా సత్సంబంధాలు ఉండమే ముఖ్యం కాని వారంతా ఒకే చూరు కింద ఉండడం కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదు కూడాను. బంధువులందరితోను సంబంధాలు కొనసాగించాలి. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. అనవసరం అనుకోకుండా సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలి. బంధువుల ఇంట శుభ కార్యాలకే కాదు వారికి కష్టం వచ్చినప్పుడు తప్పకుండా వెళ్లి ఓదార్చాలి. బంధువుల మధ్య అనుకోకుండా ఏర్పడిన విభేదాలు ఇటువంటి సందర్భాల్లో కలుసుకోవడం ద్వారా సమసిపోతాయి. చాలాకాలంగా ఉన్న అంతరాలు తొలగిపోతాయి.

బుద్ధుడు సందేశాలు



సిద్ధార్థునికి స్వార్థం లేదు

సిద్ధార్థుడు భార్యను ఎంచుకొన్నాడు. యశోధరను వరించాడు. ఆమె కోలీ రాజపుత్రి. ఇద్దరికీ వివాహం నిశ్చయమయ్యింది. సిద్ధార్థునకు యశోధర యందు రాహులుడనే కుమారుడు జన్మించాడు. రాహుల అంటే శృంఖల, బంధనం. తన కుమారునికి వారసుడు పుట్టినందుకు శుద్ధోదనుడు సంతోషించాడు. "నేను రాకుమారుని ప్రేమించినట్లుగానే సిద్ధార్థుడు తన పుత్రుడిని ప్రేమిస్తాడు. ఇది అతడిని సంసారానికి బంధించి ఉంచుతుంది. శాక్య రాజ్యం నా వంశస్థుల అధీనంలోనే ఉంటుంది". అని రాజు భావించాడు.

సిద్ధార్థునికి స్వార్థం లేదు. తన సంతానాన్ని సమస్త ప్రజలను ఆయన ఒకటిగానే పరిగణించారు. ధర్మానుసారం విధులను నిర్వహించాడు. పవిత్ర గంగా జలాలలో స్నానంచేసి శుద్ధి చేసుకొన్నాడు. తమ పిల్లలకు సుఖాన్నివ్వాలని తండ్రులు ఎలా వాంఛిస్తారో అలాగే సిద్ధార్థుడు లోకానికి శాంతి సౌభాగ్యాలు ఇవ్వాలని తపించేవాడు. సకల ఐశ్వర్య భోగాలతో సంపన్నమైన ఒక రాజ భవనాన్ని సిద్ధార్థునికి తండ్రి బహూకరించాడు. తనయుడు సుఖ సంతోషాలతో ఉండాలని తండ్రి కోరిక. అందువలన దుఃఖ కారణమైన దృశ్యాలు అతని కంటబడకుండా జాగ్రత్త తీసుకొన్నాడు. కష్టాలు, కన్నీళ్లు సిద్ధార్థుని తాకరాదు. లోకంలో పాపం, దుఃఖం, దారిద్ర్యం, చెడు ఉన్న సంగతే ఆయన చెవిన పడరాదని తండ్రి శాసించాడు. అయితే బంధించిన ఏనుగు అడవిలో విహ రించాలని అదుర్దా పడినట్లుగా రాజకుమా రుడు ప్రపంచాన్ని చూడాలని కుతూహల పడ్డాడు.

ఆరోగ్యం



కొత్తిమీరతో లాభాలు

కొత్తిమీరను నిత్యం మనం పలు వంటల్లో వేస్తూనే ఉంటాం. కొందరు దీంతో పచ్చడి చేసుకుంటారు. ఇక చారు వంటి ఆహారాల్లో అయితే కొత్తిమీర లేకుండా ఉండదు. ఈ క్రమంలోనే కొత్తిమీర వల్ల వంటలకు చక్కని రుచి వస్తుంది. అయితే కొత్తిమీర కేవలం రుచికి, సువాసన కోసమే అనుకుంటే పొరపాటు పడినట్టే. ఎందుకంటే వాటితోపాటు కొత్తిమీరలో అనేక రకాల పోషకాలు, ఆరోగ్యాన్ని కలిగించే గుణాలు ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1. కొత్తిమీరలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దీంట్లో ఉండే పోషకాలు జీర్ణ వ్యవస్థకు, రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఉపయోగపడతాయి. కొత్తిమీరలో ఉండే డొడిసెనోల్ అనే పదార్థం పేగుల్లో ఏర్పడే సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షిస్తుంది.


2. ఒక గ్లాస్‌లో నీరు, మజ్జిగను సమభాగాల్లో కలిపి అందులో చెంచా కొత్తిమీర రసం, చిటికెడు జీలకర్ర కలిపి మధ్యాహ్నం లేదా రాత్రి తీసుకుంటే శరీరానికి కావల్సిన విటమిన్లన్నీ లభిస్తాయి. విటమిన్ ఎ, బి1, బి2, సి, ఐరన్ వంటివి పుష్కలంగా అందుతాయి. శరీర నిర్మాణానికి, ఎముకల దృఢత్వానికి, చర్మ సంరక్షణకు ఇది తోడ్పడుతుంది.

3. అజీర్ణం బాధిస్తుంటే కొత్తిమీర రసంలో జీలకర్ర, నిమ్మరసం, చిటికెడు ఉప్పు కలిపి తీసుకుంటే ఫలితం కనిపిస్తుంది. గర్భిణీలు రోజూ 2,3 చెంచాల కొత్తిమీర రసాన్ని నిమ్మ రసంతో కలిపి తీసుకుంటే కడుపులో తిప్పడం, మలబద్ధకం వంటివి తగ్గిపోతాయి.

4. పేగుపూత, కడుపులో మంట ఉన్నవారు కొత్తిమీరను పెరుగులో కలిపి తరచూ తీసుకుంటే ఆ సమస్యలు దూరమవుతాయి.

5. నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్యలు ఉన్నవారు కొత్తిమీర ఆకులను నమిలి మింగితే త్వరగా గుణం కనిపిస్తుంది. కామెర్లు వచ్చినప్పుడు పథ్యంగా దీన్ని కూరల్లో వేసి వండి తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

చరిత్రలో జనవరి 11



1922 : మధుమేహ రోగులకు ఇన్సులిన్ వాడకం ప్రారంభించిన రోజు.

1928 : ప్రకృతి ధర్మవాద సమయంలో ఒక ఆంగ్ల నవలారచయిత మరియు కవి థామస్ హార్డీ మరణం.

1944 : భారతదేశంలోని జార్ఖండ్ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ జననం.

1966 : భారత దేశ రెండవ ప్రధాని, ప్రధానిగా శ్వేతవిప్లవం, హరితవిప్లవం, పాకిస్తాన్ యుద్ధం వంటి విజయాలు సాధించిన లాల్ బహదూర్ శాస్త్రి మరణం.

1973 : భారత క్రికెట్ క్రీడాకారుడు రాహుల్ ద్రవిడ్ జననం.

1991 : అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త , ఎలక్ట్రాన్ కు వ్యతిరేక కణమైన పాజిట్రాన్ కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్ డేవిడ్ అండర్సన్ మరణం.

2008 : న్యూజీలాండుకు చెందిన పర్వతారోహకుడు మరియు అన్వేషకుడు ఎడ్మండ్ హిల్లరీ మరణం.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మొగల్ సరాయ్ గ్రామంలో లాల్ బహదూర్ 1904 అక్టోబర్ 2న శారదా ప్రసాద్, రామ్‌దులారీ దేవీలకు జన్మించాడు. తండ్రి శారదా ప్రసాద్ రాయ్ ఒక నిరుపేద. బతకలేక బడిపంతులు అని అనుకుంటున్న ఆ రోజుల్లో ఆయన బడిపంతులు వృత్తిని చేపట్టి అతికష్టంగా తన కుటుంబాన్ని పోషిస్తూ కాలం గడిపేవాడు. ఇద్దరు ఆడపిల్లల తరువాత జన్మించిన లాల్ బహదూర్ ను చూసుకొని ఆ తల్లిదండ్రులెంతో మురిసిపోయారు. నిరాడంబరతకు తోడు ఎంతో అభిమానవంతుడైన లాల్ బహదూర్ స్కూలుకు వెళ్ళటానికి ప్రతి రోజు గంగానదిని దాటి వెళ్ళవలసి ఉండేది. నది దాటించే పడవ వాడికి ప్రతి రోజు కొంత పైకం యివ్వాలి. అది స్వల్పమే అయినా లాల్ బహదూర్ దగ్గర అప్పుడప్పుడు ఉండేదికాదు. పడవ మనిషిని అడిగితే ఊరికే నది దాటించగలడు. అయినా అభిమానవంతుడైన లాల్ బహదూర్ అలా ప్రాధేయపడటం ఇష్టంలేక తన బట్టలను విప్పి, వాటిలో పుస్తకాలను చుట్టి మూటలా కట్టి, తన వీపునకు తగిలించుకుని, ప్రాణాలను సైతం తెగించి అవతలి ఒడ్డుకు ఈదుకుని వెళ్ళేవాడు. దురదృష్టవశాత్తు కొడుకు పుట్టిన ఏడాదిన్నరకే లాల్ బహదూర్ తండ్రి మరణించడంతో, ఆ కుటుంబం దిక్కులేని నావలా నిరాధారమైంది. ఆ కుటుంబాన్ని లాల్ బహదూర్ తాత ఆదుకుని వారికి ఆశ్రయం కలిగించాడు. తాతగారింట భయభక్తులతో పెరిగిన లాల్ బహదూర్ తన పాఠశాలలో ఎంతో నిరాడంబరంగా ఉంటూ ఉపాధ్యాయుల ప్రేమాభిమానాలను చూరగొన్నాడు. తోటి విద్యార్థులు తనకు తండ్రి లేడని గేలిచేస్తూ హేళన చేస్తున్నప్పటికీ ఆ దుఃఖాన్ని దిగమింగి, ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయక, వారితో పాటు ఆడుతూ, పాడుతుండేవాడు.

దిన ఫలాలు

గురువారం - 11-1-2018

మేషం: లీగల్ వ్యవహారాలు ఆందోళన కలిగిస్తాయి. ఆదాయం పెరిగినా ఖర్చులు కూడా ఎక్కువవుతాయి. సహోద్యోగుల సహాయం అందుతుంది. ఒత్తిడి అధికమవుతుంది.

వృషభం: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతారు. వ్యక్తిగత విషయాలలో గోప్యత పాటించాలి. వైవాహిక జీవితం అద్భుతంగా ఉంటుంది.

మిథునం: స్నేహితులతో కలిసి వినోదాల్లో పాల్గొంటారు. కొత్త ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. తెలివితేటలకు పదను పెట్టాల్సిన రోజు. ఆర్థిక లావాదేవీలు కొలిక్కి వస్తాయి.

కర్కాటకం: నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఎదుటివారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆస్తి వ్యవహారాలు కొలిక్కివస్తాయి. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా గుర్తించుకోవాలి.

సింహం: ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పెట్టుబడుల విషయంలో సరైన సలహా తీసుకోవాలి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ఉత్తమం.

కన్య: ఆర్థిక సమస్యలు ఆందోళనకు కారణమవుతాయి. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇతరులకు సలహా ఇచ్చి లబ్ధి పొందుతారు. విద్యార్థినులకు ఒత్తిడి, చికాకులు.

తుల: ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. అశ్రద్ధ వల్ల కొంత నష్టం తప్పదు. నమ్మకంగా ఉన్నవారు నిజాలను వెల్లడించ దానికి అంగీకరించరు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: ప్రియమైన వారితో సంబంధాలు చెడే ఆస్కారం ఉంది. సన్నిహితులతో అభిప్రాయ భేదాలు తప్పవు. ఆర్థికంగా ఎదగడానికి చేసే ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి

ధనస్సు: ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విలాసాలకు చేసే ఖర్చులను అదుపులో ఉంచుకోవాలి. స్నేహితులతో సంతోషంగా గడుపుతారు.

మకరం: ఊహించని ఓ శుభవార్త కుటుంబంలో సంతోషానికి కారణమవుతుంది. ఇతరుల సలహా పాటించి ప్రయో జనం పొందుతారు. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

కుంభం: విశాలభావాలకు పరీక్షా సమయం. స్పెక్యులేషన్ ద్వారా అనుకోని లబ్ధి పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతారు. స్నేహితులతో కలిసి వినోదాల్లో పాల్గొంటారు. ప్రియమైన వారితో సంతోషంగా ఉంటారు.

తిరుమల చరితామృతం

హనీమూన్‌కి తిరుమల



సమాజంలో ధనికులు, పేదలు వ్యత్యాసం వున్నంతవరకూ, పలుకుబడి, అధికారం వున్నవారు- లేనివారూ అన్న వివక్ష వున్నంతవరకూ ఈ తారతమ్యం ఆలయంలో వుండే అవకాశం ఉంది. ఒక వేళ విఐపిలనబడే వర్గమే లేకుండా టీటీడీ వారు నిబంధనలు రూపొందించినా, 'శాత్తుమొరై' దర్శనం కోసం వచ్చే శ్రీ వైష్ణవులు ముఖ్యులవుతారు. ఇంకా టీటీడీ చైర్మన్, ట్రస్టు బోర్డు సభ్యులూ ముఖ్యులవుతారు. ఆస్థానం జరిగేటప్పుడు చోటు చేసుకునే సర్కారుహారతి, ఇతర మర్యాదల కారణంగా వరుసగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇంకా ఇతర అధికారులు, వలంటీర్లు ముఖ్యులవుతారు. అప్పుడు కూడా సామాన్య భక్తులకు వచ్చే ప్రశ్న -వీళ్లంతా విఐపిలా?

అందుకే అనవసరమైన రాద్ధాంతాలు లేకుండా చేయాలంటే, ఎవరు "వి.ఐ.పి.లు? అన్న విషయంపై టి.టి.డి.కి ఒక స్పష్టత ఉండాలి. స్పష్టమైన నిర్వచనమిచ్చి, దాన్ని బహిరంగంగా ప్రకటించాలి. కేవలం అధికార్ల విచక్షణాధికారాన్ని బట్టి వి.ఐ.పి.'లను నిర్వచించే విధానానికి స్వస్తిపలకాలి. మన ప్రజాస్వామిక వ్యవస్థలో "వి.ఐ.పి.లు లేకుండా ఎలాగూ చేయలేం. కనీసం స్పష్టమైన నిర్వచనమిచ్చి, ఆ విధానాన్నైనా పాటిస్తే, విమర్శలు ఇంతలా ఉండవు. అసలు సమస్య నిజమైన "వి.ఐ.పి." లతో కన్నా'వి.ఐ.పి.ల సిఫార్సు లేఖలతో వచ్చే వాళ్లతోనూ, వి.ఐ.పి.ల వందిమాగధులతోనే. వాళ్లను కూడా "వి.ఐ.పి.'లు గానే పరిగణించడం వల్లనే ఈ గొడవలన్నీ వస్తున్నాయి. అంతకంటే ముఖ్యంగా ఆలోచించాల్సింది సామాన్యభక్తునికి తిరుమల యాత్ర చేసినప్పుడు తృప్తికలిగేలా ఎలా చెయ్యాలో ఆలోచించడం. నేను త్రిసభ్యకమిటీకి అధ్యక్షుడుగా వెయ్యికాళ్లమంటపం, మాస్టరు ప్లాను విషయాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఈ విషయంపై చాలా చర్చ జరిగింది. ధనికులు అందరూ తృప్తిగా దర్శనం చేసుకొని వెళ్తున్నారా అంటే అదీ లేదు. స్వామి వారి సేవలకు డబ్బులు కట్టి చూద్దామన్నా అందరికీ అవకాశం లేదు. ఎందుకంటే - స్థలాభావం వలన మూలవర్లకు జరిగే సేవలకంటే అర్థం వుంది. అక్కడ 100 మంది కంటే ఎక్కువ పట్టరుకాబట్టి. కాని ఇతర సేవలకు డబ్బు కట్టినా కట్టకపోయినా అందరూ చూసి తరించే వ్యవస్థ రావాలి.

దాన్ని దృష్టిలో వుంచుకొనే నేను కార్యనిర్వహణాధికారిగా వున్నప్పుడు ఆలయం బయట "సహస్రదీపాలంకార సేవ' మొదలుపెట్టింది. టిక్కెట్టు కొన్నవారూ చూస్తారు. కొనలేని భక్తులూ చూసి ఆనందిస్తారు. వెయ్యికాళ్ల మండపం కూలకొట్టినప్పుడు, ఆలోచించి ఒక మహామండపం (చుట్టూ తెరిచి పైకప్పు మాత్రమే వుండేది) ఆలయం ముందు కట్టాలని సూచించాం. అది వెయ్యికాళ్ల మండపంలా అన్పించేలా ఎలా కట్టాలో కూడా చాలా సూచనలు చేశాం. ఉత్సవరులకు ఇప్పుడు గుడిలోపల, బయట వైభవ మండపం హాలులో జరుగుతున్న అన్ని సేవలూ వుదయం నుండి సాయంత్రం వరకు భక్తులందరి సమక్షంలో ఆలయం బయట జరగాలని సూచించాం. 5000 మంది టిక్కెట్లు కొని చూడవచ్చు. 10,000 మంది ఇతర భక్తులు పైసా కట్టకుండా చూడవచ్చు.

ఆలయం లోపల మూలవరులను ఒక్క క్షణం కూడా చూడలేని సామాన్యభక్తుల డబ్బుకట్టకపోయినా రోజంతా ధనికులలాగా స్వామివారి సేవలన్నీ యిపుడు సహస్రదీపాలంకార సేవ చూసినట్లే చూసి తరించి తృప్తిగా తిరుమల యాత్ర సఫలం చేసుకోవచ్చు. అప్పుడు శ్రీనివాసుడు ధనికుల దేవుడన్న భావనపోయి, భక్తుల దేవవిశ్వాసం కలిగే పరిస్థితి ఏర్పడుతుంది.

హనీమూన్‌కి తిరుమల!

ఆమధ్య ఒక వివాహం సందర్భంగా వధువు తండ్రి నన్ను అడిగారు. "అమ్మాయిని, అల్లుణ్ణి పెళ్లయ్యాక తిరుమల కొండమీద మూడు నిద్రలు చేయించి, అక్కడ్నుంచి ఊటీ పంపిద్దామనుకుంటున్నాను. కొంచెం మీరు కాటేజీలకు సిఫార్సు చేయాలి!"

నాకు బాధ కలిగింది. ఆ మిత్రుణ్ణి కూర్చోబెట్టి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను.

పురాణాల్లో తీర్థయాత్ర ఎలా చేయాలో చాలా విపులంగా చెప్పారు. కుమారస్వామికి పరమశివుడు చెప్పినా, మార్కండేయునికి నారద, గరుత్మంతులు చెప్పినా, శుద్ధ అన్న బ్రాహ్మణునికి అగస్త్యుల వారు చెప్పినా, బ్రహ్మదేవులు దేవతలకు చెప్పినా, రుద్రుని అవతారమైన శుకమహర్షి తాను వేంకటాచల యాత్ర ఎలా చేశాడో పురాణం వివరించినా. అందరూ కర్మభూమిగానే ఆ క్షేత్రాన్ని చూశారు. ఎందరో మహాత్ములు, దేవతలు, రాజులు, చక్రవర్తులు, ధనికులు ఎలా యాత్రలు చేశారో పురాణాల్లో చాలా సందర్భాలలో విపులంగా చెప్పబడింది.

సంచలన వార్తాపత్రిక
లీడర్
ఆంధ్రప్రదేశ్/జాతీయం
విశాఖపట్నం
గురువారం 11-1-2018

వాల్మీకి బోయలను ఎస్.టి.లో చేర్చవద్దు

సీతంపేట, న్యూస్‌లీడర్: బోయ వాల్మీకీ కులస్తులను గిరిజన జాబితాలో చేర్చుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవలసిందిగా రాష్ట్ర ఇందనశాఖా మంత్రి కె. కళావెంకటరావుకు గిరిజన ఐక్యవేదిక నాయకులు బి.తేజేస్వరరావు, నిమ్మక కాంతారావు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించి సి.ఎమ్. దృష్టిలో పెడతానని హామీ ఇచ్చారు.

ఏటీఎంలకు చలేస్తోందట..

- రగ్గులు కప్పుతూ, హీటర్లు పెడుతున్నారు!
- జామైపోయి డబ్బులు రాక ఇబ్బందులు



(ప్రత్యేక ప్రతినిధి)

చలి మనుషులకేనా? ఎంతమాత్రమూ కాదంటున్నారు హిమాచల్‌ప్రదేశ్‌లోని బ్యాంకు అధికారులు. వాటిని వెచ్చగా ఉంచేందుకు రగ్గులు కప్పుతున్నారు. అక్కడితో ఆగడం లేదు.. మరింత వెచ్చగా ఉంచేందుకు హీటర్లు కూడా పెడుతున్నారు. విచితంగ్రా ఉన్నా ఇది వాస్తవం! రాష్ట్రంలోని లాహౌల్-స్పిటి జిల్లాలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. మైనస్ డిగ్రీలకు చేరుకోవడంతో ఏటీఎంలు జామ్ అయిపోతున్నాయి. దీంతో డబ్బులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిష్కార మార్గం ఆలోచించిన బ్యాంకు అధికారులు ఏటీఎం కేంద్రాల్లో హీటర్లు పెట్టడంతోపాటు రగ్గులు కూడా కప్పుతున్నారు. జిల్లాలోని కేలాంగ్ ప్రాంతంలోని ఏటీఎంలు ఇప్పుడు రగ్గులతో దర్శనమిస్తున్నాయి. లాహౌల్-స్పిటిలో ఉష్ణోగ్రతలు మైనస్ 25 డిగ్రీల సెల్సియస్ డిగ్రీలకు పడిపోయాయి. దీంతో ఏటీఎంలు పనిచేయడం మానేశాయి. అంతేకాదు.. యంత్రాలు పాడైపోతుండడంతో స్పందించిన అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. గదిని వెచ్చగా ఉంచేందుకు హీటర్లు పెడుతున్నామని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా చలికి గడ్డకట్టుకు పోతున్నారు. నల్లానీళ్లు కూడా గడ్డకట్టుకుపోతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక వాహనాల మొరాయింపునకు అంతేలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 28 నుంచి అమర్‌నాథ్ యాత్ర



జమ్ము:
ప్రఖ్యాత అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది 60 రోజులపాటు కొనసాగనుంది. జ్యేష్ఠపూర్ణిమనాడు (జూన్ 28న) దీన్ని ప్రారంభించనున్నట్లు దేవస్థాన బోర్డు అధికార ప్రతినిధి మంగళవారం తెలిపారు. బోర్డు సభ్యులతో సమావేశమైన అనంతరం బోర్డు ఛైర్మన్, రాష్ట్ర గవర్నర్ ఎన్ఎన్ వోరా తేదీలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లోని ఈ దేవాలయ పరిసరాల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై ఇటీవల జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలపైనా చర్చించామని, వీటిపై సమీక్షా పిటీషన్ దాఖలు చేస్తామని వివరించారు. దేవాలయ పరిసరాల్లో అందరూ నిశ్శబ్దం పాటించాలని ట్రిబ్యునల్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై నిరసనలు వ్యక్తంకావడంతో.. గుహలో మంత్ర ఉచ్చారణలు, భజనలపై తాము ఎలాంటి నిబంధనలూ విధించడంలేదని ఎన్‌జీటీ స్పష్టతనిచ్చింది. మంచు లింగం ముందుకు వెళ్లినప్పుడు మాత్రం అందరూ నిశ్శబ్దంగానే ఉండాలని స్పష్టీకరించింది.

13 నుంచి కైట్, స్వీట్ ఫెస్టివల్



హైదరాబాద్ :
రాష్ట్ర పర్యాటకశాఖ అంతర్జాతీయ పతంగుల పండుగకు, మిఠాయిల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 13,14, 15 తేదీల్లో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. 22 దేశాలకు చెందిన నిపుణులు హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు అంగీకారం తెలిపారని టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. రాష్ట్ర భాషాసాంస్కృతికశాఖ డప్పుల దరువులు, కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుడకలు వంటి సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించనున్నది. జానపద కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి శివతాండవం, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య రూపకాలను ప్రదర్శించనున్నారు. దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నారు. వెయ్యికి పైగా మిఠాయిలు ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. కాకినాడ ఖాజా, బందరు లడ్డూలు, పదిరకాల పాయసాలు కొలువుదీరను న్నాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీలు, బెంగాలీలు, రాజస్తానీలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక అసోసియేషన్స్ మిఠాయిలను ప్రదర్శనకు తీసుకురానున్నాయి. ప్రతి మిఠాయిని ఇంట్లో తయారు చేసి తీసుకురావాలని నిబంధన విధించారు. మిఠాయిలకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున విక్రయశాలలు ఏర్పాటు చేస్తున్నారు.

పాట్నా ప్యాసింజర్ రైల్లో మంటలు



పాట్నా :
బిహార్ లోని మొకామాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మొకామా రైల్వేస్టేషన్ యార్డ్‌లో నిలిపి ఉన్న పట్నా-మొకామా ప్యాసింజర్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అయిదు బోగీ అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో జరిగింది. ముందుగా రెండు బోగీల్లో మంటలు చెలరేగాయి. ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగానే మంటలు మరో రెండు మూడు బోగీలకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది అయిదు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికీ బోగీలు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద కారణాలపై రైల్వే భద్రతా అధికారులు దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు.

రియల్టర్‌కు ఫేస్‌బుక్ మహిళ బురిడీ

ఆన్‌లైన్‌లో రూ.20 లక్షల వసూలు




బనశంకరి:
ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఒక కిలాడీ మహిళ తీయని మాటలతో బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని బురిడీ కొట్టించింది. అమెరికా నుంచి లక్షల డాలర్లు పంపుతున్నాను, కొరియర్‌లో డబ్బు కట్టి తీసుకోవాలంటూ రూ.20 లక్షలు స్వాహా చేసింది. వివరాలు....బెంగళూరుకు చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఫేస్‌బుక్‌లో ఒక మహిళ పరిచయమైంది. తనది అమెరికా అని ఆమె చెప్పుకుంది. ఇద్దరూ రోజూ చాట్ చేస్తూ ఆన్‌లైన్‌లో స్నేహం చేశారు. తాను బెంగళూరులో అపార్టుమెంట్ కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు ఆ మహిళ ఆదినారాయణకు తెలిపింది. ఇందుకోసం 20 లక్షల అమెరికన్ డాలర్ల సూట్‌కేస్‌ను పంపిస్తున్నానని, ముంబాయిలో తన ఖాతాలోకి ప్రాసెసింగ్ ఫీజుల కింద డబ్బు చెల్లించి ఆ సూట్‌కేస్‌ను తీసుకోవాలని ఆ మాయలాడి రియల్టర్‌ను నమ్మించింది. ముంబయి వెళ్ళిన బాధితుడు ఆమె ఖాతాలోకి రూ.20 లక్షల డబ్బు బదిలీ చేయగా, ఒక ఏజెంట్ వచ్చి సూట్‌కేస్ ఇచ్చి వెళ్లాడు. బాధితుడు ఆశగా తెరిచి చూడగా అందులో నకిలీ డాలర్ నోట్లు కనిపించాయి. మహిళ చేతిలో మోసపోయినట్లు గ్రహించిన రియల్టర్ మంగళవారం బెంగళూరు సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

భోపాల్‌లో శానిటరి నాప్కిన్స్ వెండింగ్ మెషిన్



భోపాల్:
దేశవ్యాప్తంగా ఏ రైల్వే స్టేషన్ చూసినా టికెట్ కౌంటర్లు, సమాచార కేంద్రాలు, శౌచాలయాలు, విశ్రాంతి గదులు ఉంటాయి. ఇందులో ఆశ్చర్యం ఏముంది అందరికీ తెలిసిందే కదా అనుకుంటున్నారా? అయితే, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జంక్షన్ ఇందుకు భిన్నం. ఇక్కడ ఇవన్నింటితో పాటు మహిళల అవసరాలను తీర్చే సదుపాయమూ ఉంది. రుతుక్రమం వచ్చే మహిళలు, యువతులను దృష్టిలో ఉంచుకుని వారి కోసం తక్కువ ఖర్చుతో కేవలం రూ.5కే రెండు శానిటరీ నాప్కిన్స్‌ను అందించేందుకు వెండింగ్ మెషిన్‌ను ఇక్కడి అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి 'హ్యాపీ నారి' అని నామకరణం చేశారు. దీంతో దేశంలో ఇలాంటి వెండింగ్ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన మొదటి రైల్వే స్టేషన్‌గా భోపాల్ జంక్షన్ ఖ్యాతికెక్కింది. 'హ్యాపీ నారి'లో 75 శానిటరీ నాప్కిన్స్ ఉంటాయి. ఇది ప్రారంభించిన మొదటి రోజు నుంచే మంచి స్పందన వస్తోంది. స్థానికంగా ఉన్న ఆరుషి స్వచ్ఛంద సంస్థ మొదటి రోజు 500కు పైగా శానిటరీ నాప్కిన్స్‌ను అందించింది. ఎనిమిది నుంచి తొమ్మిది గంటల్లోనే దాదాపు 600కు పైగా నాప్కిన్స్ అయిపోయాయంటే దీనికి ఉన్న ఆదరణ ఏపాటిదో అర్థమౌతుంది. ఈ మెషిన్ ఏర్పాటు, నిర్వహణ కోసం అయిన పూర్తి ఖర్చు కేవలం రూ.20 వేలు మాత్రమే. మహిళలు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాణం చేయడంతో పాటు దిగువ మధ్యతరగతి వారికి కూడా అందుబాటు ధరలో నాప్కిన్స్ లభించాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశామని భోపాల్ రైల్వే డివిజన్ మేనేజర్ (డీఆర్ఎం) శోభన్ చౌదరి అన్నారు. కేవలం రైల్వే ప్రయాణికులు మాత్రమే కాకుండా చుట్టుపక్కల మురికివాడల్లో నివసిస్తున్న వారు కూడా ఈ సౌలభ్యాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ మెషిన్‌లో నాప్కిన్స్ పెట్టడం, నిర్వహణకు సంబంధించిన విషయాలపై పలు స్వచ్ఛంద సంస్థలు మహిళా రైల్వే ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. స్టేషన్‌లోని మహిళల విశ్రాంతి గదుల్లో ఉన్న శౌచాలయాల్లోనూ జనవరి చివరికల్లా ఇలాంటి ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని డీఆర్ఎం తెలిపారు.

నకిలీ ఆన్‌లైన్ సినిమా టికెట్లతో జాగ్రత్త!



హైదరాబాద్:
సినిమా టికెట్లు అంతర్జాలంలో కొంటున్నారా..? వెబ్‌సైట్ల చిరునామాలు, వాటి వివరాలు పక్కాగా తెలుసుకున్నాకే కొనుగోలు చేయాలంటున్నారు పోలీసులు. ఎందుకంటే.. కొత్త సినిమాల క్రేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు సైబర్ నేరస్థులు వందల కొద్ది వెబ్‌సైట్లను ప్రారంభించి టికెట్లు విక్రయించిన మరుక్షణం వాటిని మూసేస్తున్నారు. తీరా టికెట్ లభించిందని థియేటర్‌కు వెళ్లిన వారికి నిరాశే ఎదురైన సందర్భాలు ఉన్నాయి. గతేడాది ఏప్రిల్‌లో బాహుబలి-2 విడుదలైనప్పుడు 'న్యూటికెట్.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఇలా వందల కొద్ది నకిలీ టికెట్లను విక్రయించారు. పండగ నేపథ్యంలో సినిమాలు విడుదలవుతున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కొత్త సినిమాలు విడుదలైన తొలి రోజుల్లో హైదరాబాద్‌లోని పలు థియేటర్ల వద్ద కొందరు వ్యక్తులు బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు రావడంతో రెవెన్యూ, ఐటీ శాఖలు స్పందించి అంతర్జాలం ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించాయి. అయితే, ప్రభుత్వం అనుమతించిన సైట్లలోనూ సైబర్ నేరస్థులు చొరబడి అక్రమాలకు పాల్పడుతున్నారని తేలింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో సినిమా టికెట్లు విక్రయాలు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ పర్యవేక్షణలో జరిగేలా చూడాలని ఉన్నతాధికారులు సూత్రప్రాయంగా విధివిధానాలు రూపొందించారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లోకి వెళ్లాకే ఆయా సైట్లు తెరుచుకునేలా వ్యవస్థను రూపొందించి నకిలీలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు. ఈ విధివిధానాలను ఉత్తర్వులుగా తయారు చేసేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు, ఐటీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

యువతి దారుణ హత్య



హైదరాబాద్:
మూసాపేట్ హబీబ్‌నగర్‌లో బోను జానకి అనే యువతి దారుణహత్యకు గురైంది. మంగళవారం రాత్రి యువతి నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించిన దుండగుడు ఆమెను కత్తితో పొడిచి చంపేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలిని శ్రీకాకుళం జిల్లా రాజాం మండలానికి చెందిన యువతిగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఆనంద్ అనే యువకుడిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనను ప్రేమించకపోతే చంపేస్తానని ఆనంద్ చాలాసార్లు జానకికి బెదిరించినట్లు స్నేహితులు పోలీసులకు తెలిపారు.

గ్యాస్ లీక్...

మంటల్లో చిక్కుకున్న తల్లీకూతురు

పెంటపాడు : వంటగ్యాస్ సిలిండర్ లీకై ఇల్లంతా మంటలు వ్యాపించడంతో అందులో చిక్కుకుని తల్లీకూతురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం జరిగింది.వంట గదిలో ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. పక్క గదిలో నిద్రుస్తున్న కుటుంబసభ్యులు భయంతో బయటికి పరుగు తీయగా పితాని వెంకటలక్ష్మి(45) ఆమె కుమార్తె లక్ష్మీప్రసన్న (15) మంటల్లో చిక్కుకుని బయటికి రాలేకపోయారు. దుప్పటి ఒంటి నిండా కప్పుకుని మంటల్లోనే ఉండిపోయారు. దాంతో ఇరుగుపొరుగువారు ప్రయత్నించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే తల్లీకూతుళ్ల శరీరం బాగా కాలిపోయింది. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వారిద్దరూ కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు.

మహిళలకు వంటల పోటీలు

జిల్లా పర్యాటక అధికారి అనిత



విజయనగరం: ఐదోవిడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం ముగింపు రోజైన జనవరి 11న జిల్లా కేంద్రంలో, అన్ని మండలాల్లో మహిళలకు తెలుగు వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. మా పంటలు - మా వంటలు పేరుతో పట్టణంలోని అయోధ్య మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇద్దరు మహిళలు ఒక జట్టుగా ఏర్పడి యీ పోటీల్లో పాల్గొనవచ్చని గృహిణులు, స్వయంశక్తి సంఘాల మహిళలు ఎవరైనా యీ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 1)అల్పాహారంకు సంబంధించిన వివిధ రకాల వంటకాలు, 2) శాఖాహార, మాంసాహార భోజనానికి సంబంధించిన విభిన్న తరహా వంటకాలు, రుచులు 3) స్వీట్లు (మిఠాయిలు) తయారీలో పోటీలు వుంటాయన్నారు. మండలాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఏ.పి.ఎం. ఒక ప్రజాప్రతినిధి సభ్యులుగా ఉత్తమ వంటల ఎంపికకు ఒక న్యాయనిర్ణేతల కమిటీని ఎంపిడిఓలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ఒక్కో విభాగంలో ముగ్గురికి చొప్పున మొత్తం తొమ్మిది మందిని ఎంపికచేసి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన జట్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేసి పంపించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు సంబంధించి ఇతర వివరాలకోసం జిల్లా పర్యాటకశాఖ కార్యాలయం ఫోన్ నెంబరు 08922-272333 లో సంప్రదించాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లాలోని మహిళలంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పర్యాటక అధికారి కోరారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించే వరకు పోరాటం



సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘాలు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్:
రాష్ట్ర ప్రభుత్వం పింఛను విధానం కొనసాగించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అకడమిక్ సెల్ కమిటీ సభ్యుడు లఖినేని కరుణ్‌కుమార్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షన్‌సాధన సమితి ఆధ్వర్యంలో సంబంధిత జేఏసీ కన్వీనర్ కూన వలసయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయటం ద్వారా రాష్ట్రంలో సుమారు 1.50వేలు మంది ఉద్యోగులకు లాభం చేకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. అందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయ సూపరెండెంట్ డి. సోనికిరణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కె. కామేశ్వరరావు, అప్టా జిల్లా అధ్యక్షుడు రామారావు, పీఆర్‌టీయు నాయకులు ఇప్పిలి మాధవరావు, ఏపీసీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి మాధవరావు, జి.నారాయణరావు, మెంద గోవిందరావు, పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

రాష్ట్ర ఇందన శాఖామాత్యులు కళావెంకటరావు



సీతంపేట, న్యూస్‌లీడర్:
గిరిజనుల అభివృద్ధికి ఎన్.టి.ఆర్. ఐటిడిఎలను ఏర్పాటు చేసి మన్యంవాసులకు ఆరాధ్య దైవంగా నిలిచి వాళ్ల అభివృద్ధికి బాటలు వేశారని రాష్ట్ర ఇందన శాఖామాత్యులు కె. కళావెంకటరావు కొనియాడారు. భామినికి మంజూరయిన గిరిజన ఇంగ్లీసు మీడియం ఏకలవ్య పాఠశాలను, సీతంపేటలో వై.టి.సీ.లో తాత్కాలిక ఏకలవ్య పాఠశాలను ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడులకు వెల్లేవిధంగా తల్లిదండ్రులు తగు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పిల్లలు విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, విద్య ఎంతటి స్థాయికైనా తీసుకు వెళ్లేందుకు అవకాశం ఉందని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతాలలో మౌలిక సౌకర్యాల కల్పించేందుకు ఐటిడిఎ పి.ఓ. ఎల్. శివశంకర్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విద్యార్థినులతో కలిపి మంత్రి గిరిజన ధింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్.ఎల్.ఎ. వి.కళావతి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేసారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ, ఆర్.డి.ఓ. గున్నయ్య, డి.ఎస్.పి. స్వరూపరాణి, డిప్యూటీ డిఈఓ జి.రామ్మోహనరావు, ఎమ్.పి.పి లు, జడ్.పి.టి.సీ లు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయం ప్రారంభం. సీతంపేటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, మంత్రి కె.కళావెంకటరావు మంగళవారం రాత్రి ప్రారంభించారు. నియోజక వర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిచే విదంగా కార్యకర్తలంతా కలసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.దమయంతి నాయుడు, వెంకటరమణ, మాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో ఏనుగుల బీభత్సం



అరటి పంటను నాశనం చేసిన ఏనుగులు

గంగవరం:
మండలంలో వరుసగా మూడవ రోజు ఏనుగులు పంట పొలాలలో బీభత్సం సృష్టించాయి. ఇష్టానుసారంగా పంటల్ని తొక్కి నాశనం చేశాయి. మండల పరిధిలోని బండమీద జరావారిపల్లె గ్రామ పరిసరాల్లోని పొలాలపై సోమవారం రాత్రి మళ్లీ ఏనుగులు దాడి చేశాయి. గ్రామ పరిధిలోని పలువురు రైతులకు చెందిన అరటి, మామిడి చెట్లను నేలకూల్చాయి.

జన్మభూమిలో ప్రజల స్పందన భేష్

ఎంపీపీ రామక్రిష్ణ



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రామక్రిష్ణ

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్:
మండలంలోగల చీపుర్లపాడు పంచాయతీలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జన్మభూమి - మా ఊరు గ్రామసభ పండగ కళ కనిపించడంతో ప్రజల స్పందన భేష్ అని మండల పరిషత్ అధ్యక్షుడు తర్ర రామక్రిష్ణ అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో చీపుర్లపాడు, ఊడికలపాడు పాఠశాల విద్యార్థులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీంతో విద్యార్థులు ధరించిన వస్త్ర అలంకరణ, చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించటంతో ఈ గ్రామానికి ముందుగానే సంక్రాంతి వచ్చినట్టు కనిపిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు చంద్రన్నబీమా, అర్హులందరికి పింఛన్లు, గ్రామాలకు మౌళిక సదుపాయలు కల్పించటంలో ఈ గ్రామం గతం కంటే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. పంచాయతీకి చెందిన ఇరువురు ప్రమాధవశాత్తు మరణించటం, రోడ్డు ప్రమాధంలో ఒకరికి కాలుపోవడంతో వారికి చంద్రన్న బీమా వర్తించి వారి కుటుంబాలు ఆదుకోవటం ప్రత్యక్షంగా పథకాలను అందుతున్న విషయం వివరించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు గొండు లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి అధికారి మన ఊరుకు వచ్చి మీ సమస్యలు పరిష్కరించే కార్యక్రమమే జన్మభూమి యని అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలును ప్రజలు గూర్చించి అవి ఏ ప్రభుత్వం నాయకులు వల్ల అందుతున్నాయో వారిని జ్ఞాపకం ఉంచుకొని వారిని ఆదరించాలన్నారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించాలని, దీనికి ప్రభుత్వం రూ. 15వేలు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పలువురుకు జాబ్ కార్డులు, అర్హులకు రేషన్ కార్డులు, లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఇంకా ఎవ్వరికైన రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్లు అర్హులకు అందకపోతే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్ర పరిదిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే శ్రీజగన్నాథపురం, సరియబొడ్డపాడు పంచాయతీల్లో ఎంపీడీఓ ఎం. రేణుక అధ్యక్షతన జన్మభూమి - మా ఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె. శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ వెలమల విజయలక్ష్మి, ఏపీఓ జి. హరిప్రసాద్, జెడ్‌పీటీసీ నంబాళ పద్మకుమారి శ్రీనివాస్, విద్యుత్ ఏఈ ఎం. చంద్రశేఖరావు, విద్యాశాఖాధికారి టి. నారాయణరావు పాల్గొన్నారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
విశాఖపట్నం సిటీ
విశాఖపట్నం
గురువారం 11-1-2018

11నుంచి సంక్రాంతి ప్రత్యేక బస్సులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 11నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రీజనల్ మేనేజర్ సుధీష్‌కుమార్ ఒక ప్రకనటలో తెలిపారు. సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు రైల్వేస్టేషన్, ఓల్డ్ గాజువాక,కూర్మన్నపాలెం, సింహాచలం నుంచి బయలుదేరుతాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల మీదుగా వెళ్లే ప్రాంతాలకు మరో 150 అదనపు బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు.

జన్మభూమితో నూతన ఒరవడికి శ్రీకారం

9వరోజు జన్మభూమి నిర్వహణపై టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, న్యూస్‌లీడర్ ఈజన్మభూమి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది, ప్రజల్లో విశ్వాసం పెంచింది, సంత ృప్త స్థాయిని అధికం చేసింది. శాశ్వతమైన, మెరుగైన జీవన ప్రమాణాలకు ఈ జన్మభూమి నాంది పలికిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం జన్మభూమి నిర్వహణపై నోడల్ అధికారులు,జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు.గత మూడున్నరేళ్లుగా అభివృద్ధిపై, ఆర్థిక అసమానతల తగ్గింపుపై దృష్టి పెట్టామని, అందుకోసం స్వల్పకాలిక, మధ్యకాలిక,దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేశామని తెలిపారు. పేదరికం నిర్మూలనకే సమాజ వికాసం, కుటుంబ వికాసం తెచ్చామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల ఆర్థిక అసమానతలను తగ్గించగలిగినట్లుగా తెలిపారు. కొత్తగా అందజేస్తున్న 4లక్షల పెన్షన్లకు సంబంధించిన మంజూరు ధ్రువపత్రాలను గ్రామసభలలో లబ్దిదారులకు అందజేయాలని సూచించారు.

గ్రామాలు,వార్డులకు గ్రేడింగ్‌లు ఇవ్వాలి:

"జన్మభూమి నిర్వహణపై గ్రామాలు,వార్డులకు గ్రేడింగ్‌లు ఇవ్వాలి. బెస్ట్ విలేజ్, బెస్ట్ వార్డు, బెస్ట్ మండల్, బెస్ట్



మున్సిపాలిటి, బెస్ట్ కార్పోరేషన్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి. నెలకోసారి విద్యార్థులు గ్రామాలను సందర్శించాలి, గ్రామాభివ ృద్ధిలో భాగస్వాములు కావాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. జన్మభూమి కమిటీలు, సాధికార మిత్రలు, స్థానిక సంస్థల ప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు దాదాపు 50లక్షల మంది గ్రామసభలలో పాల్గొనడం జన్మభూమి కార్యక్రమం పట్ల ప్రజలలో స్పందనకు నిదర్శనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2022నాటికి దేశంలో మూడవ అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి. 2029నాటికి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రం కావాలి. 2050నాటికి ప్రపంచంలో అత్యున్నత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలని ఆకాంక్షించారు.

సాధికారమిత్రల భాగస్వామ్యం తొలిరోజున 48శాతం ఉంటే 9వరోజున 65శాతం ఉండటంపై సంత ృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీపై 68%,రేషన్ కార్డులపై 67శాతం,చంద్రన్న బీమాపై 71% సంతృప్తి ప్రజల్లో ఉందంటూ దీనిని 80శాతం కు తీసుకె ళ్లాలని సూచించారు. ఇప్పటివరకు 9,51,822 ఫిర్యాదులు వచ్చాయని,6,85,104 అప్ లోడ్ చేశారని,2,16,272 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని అధి ,కారులు వివరించారు. పక్కా ఇళ్లపై 2,07,000, రేషన్ కార్డుల కోసం 1,62, 062, పెన్షన్లపై 1,21,000, ఇళ్లస్థలాల కోసం 1,17,460 అర్జీలు వచ్చాయని తెలిపారు.'మనం చేస్తోంది విధి నిర్వహణ మాత్రమే కాదు, ప్రజా సేవ అనేది గుర్తుంచుకోవాలి.రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా సేవాకేంద్రాలుగా పేరొందాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు సి.కుటుంబరావు, వికలాంగుల సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రియల్ టైం గవర్నెన్స్,గ్రామీణాభివృద్ధి, ప్రణాళికా శాఖ అధికారులు అహ్మద్ బాబు, రామాంజనేయులు, సంజయ్ గుప్తా, సెర్ప్,రైతుబజార్ల సీఈవోలు కృష్ణ మోహన్, రమణమూర్తి , వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్సాస్ వర్సిటీతో ఐఐపీఈ ఎంవోయూ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపీఈ) అమెరికాకు చెందిన టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఐఐపీఈ సంచాలకులు ఆచార్య వీఎస్ఆర్‌కే . ప్రసాద్, టీఏఎంయూ వర్సిటీ తరపున దేబ్‌జ్యోతి బెనర్జీ సంతకాలు చేసారు. అనంతరం ఆచార్య వీఎస్ఆర్‌కే .ప్రసాద్, మాట్లాడుతూ ఇరు వర్సిటీల మధ్య విద్యార్థులు, ఆచార్యుల బదలాయింపు జరుగుతుం దన్నారు. కొన్ని నిర్ధారిత అంశాలలో పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయడం జరుగుతుందన్నారు. టీఏఎంయూ వర్సిటీ తరపున దేబ్‌జ్యోతి బెనర్జీ మాట్లాడుతూ స్థానిక, ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా పనిచేస్తామన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు అవసరమైన సాంకేతిక, మేథో సహకారాన్ని పరస్పరం బదలాయించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ప్రతినిధులు, హెచ్‌సీసీఎల్ ఆధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు కో-ఆపరేటివ్ క్రెడిట్, థ్రిఫ్ట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షునిగా అజయకుమార్, సహాధ్యక్షునిగా ఆనంద్, కార్యదర్శిగా నరసింహం, ట్రెజరర్‌గా రాజేంద్రవర్మ, డైరెక్టరులుగా పి.దమయంతి, బి.చంద్రకళ జి.పైడిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బారావు ప్రకటించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలి



దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: నిత్యం ప్రాణాలతో పోరాడుతూ సముద్ర సంపదపై ఆదారపడి వున్న మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని మత్స్యకార సాధన సమితి కన్వీనర్ మూగి శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. మత్స్యకార ఎస్టీ సాధన సమితి అధ్వర్యంలో జీవిఎంసీ గాంధీ విగ్రహం దరి చేపట్టిన రిలేనిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు బీజేపీ, వైసీపీ నేతలతో పాటు టీడీపీ నేతలు సంఘీభావం తెలిపుతున్నారని ఆయన వెల్లడించారు. ఇటీవల విశాఖలో వున్న సీఎం మత్స్యకారుల నాయకులు పైవిరుచుకుపద్దారన్నారు. దీన్ని కొంద మంది నాయకులు ఎమ్మెల్యే వాసుపల్లిపై విమర్శలు చేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీలో కాని, శ్రీకాకుళం, విశాఖ శిబిరాల వద్ద బహిరంగంగా మాట్లాడి మద్దతు తెలిపిన మంచి నాయకుడని కొనియాడారు. ఆయన మత్స్యకారుల కోసం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆయనతో పాటు తమ ఉద్యమానికి మద్దతు పలుకుతున్న రాష్ట్ర, జిల్లా రాజకీయపార్టీ నాయకులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చురుగ్గా అగనంపూడి- దువ్వాడ రోడ్డు పనులు

అగనంపూడి, న్యూస్‌లీడర్ : అగనంపూడి, దువ్వాడ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అన్నారు. రోడ్డు పనులు పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివా సరావు చొరవతో జీవీఎంసీ రూ. 2కోట్ల నిధులతో ప్రారంభించిన రోడ్డు పనులు తొరలోనే పూర్తవుతాయన్నారు. సంక్రాంతికి అగనంపూడి, రాజీవ్ నగర్ ప్రాంతాల ప్రజలకు కానుకగా అందజేస్తు న్నందుకు బలిరెడ్డి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ సునీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, అగనంపూడి మాజీ సర్పంచ్ దాసరి సూరిబాబు, తెలుగు యువత నాయకుడు అప్పారావు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో క్రీడా వికాస కేంద్రం : ఎమ్మెల్యే పల్లా



విండ్ బాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక,న్యూస్‌లీడర్ : గాజువాక క్రీడాకారులకు పుట్టినిల్లు వంటిదని గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం లంకా మైదానంలో విండ్ బాల్ క్రికెట్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆదర్శ ప్రాంగణంలో రెండుకోట్ల రూపాయల వ్యయంతో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని క్రీడలూ ఒకే చోట నిర్వహించేందుకు క్రీడా వికాస కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో పలు వార్డుల్లో క్రీడా మైధానాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదెపా నేతలు బొండా జగన్, వెన్నెలీశ్వరరావు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

అన్నూర్ ప్లే స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు



ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఎన్ఏడీ,న్యూస్‌లీడర్ : గ్రేటర్ విశాఖ 40వ వార్డు పరిధి పార్వతీ నగర్ వద్ద నున్న అన్నూర్ ప్లే స్కూల్ లో బుధవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు సంబంధించి పాఠశాల ఆవరణలో చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు . చిన్నారులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. అనంతరం నిర్వహించిన ఆటలపోటీల్లో గెలు పొందిన చిన్నారులకు బహుమతుల ప్రధానం చేసారు . కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరీద్ పర్యావేక్షించారు . కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సహరత్ బీబీ , ఉపాధ్యాయులు రజియా, రుబినా, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ప్లాస్టిక్ నివారణకు అందరూ కృషి చేయాలి



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రయత్నిస్తాను అన్నాది అభివృద్ధి నిరోధకమని జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ (జేసీఐ) 4వ వ్యవస్థాపక దినోత్సవంలో రాహులు అన్నారు. ఉక్కునగరం జేఐసీ నిర్వహించిన నాల్గవ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ పరియావరణాన్ని కాపాడుకోడం కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అందుకు మనమంతా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్ సాహూ, సోమసుందర్, వైజాగ్ స్టీల్‌సిటీ ఏసీలు యోగేష్‌కుమార్, రామేశ్వరరావు, సంతోష్, మంజూష తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు

ఎమ్మెల్యే వాసుపల్లి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకారుల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉద్ఘాటించారు. ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించినప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల మత్స్యకా రుల నాయకులతో సీఎం మాట్లాడిన మాటలు కొందరు స్వార్థనాయకులు వక్రీకరించారని ఆయన ధ్వజ మెత్తారు. సీఎం మత్స్యకారుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, హుదూద్ తుపాన్లో సర్వం కోల్పోయిన మత్స్యకా రులకు అండగా నిలిచి ఆదుకున్న సీఎంపై ఇటువంటి అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మత్స్యకారులతా టీడీపీ వైపే వున్నారని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలోఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు పిసి.అప్పారావు, మున్నం బాలాజీ, గనగళ్ల రామరాజు, గంగమ్మ, బెహరా వెంకటరత్నం, పాల్గొన్నారు.



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఆకట్టుకున్న స్వామి వివేకానంద స్ఫూర్తి ర్యాలీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్వామి వివేకానంద 155వ జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో జన జాగరణ సమితి అధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన 500మంది విద్యార్థులు ఫేస్ మాస్కులు దరించి స్ఫూర్తిర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీకి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆంధ్రయూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడం వలనే నైపుణ్యాలు నేలపాలవుతున్నాయన్నారు. చిన్నచిన్న కారణాల వలనే వేలాది మంది విద్యార్థులు, యువకులు అకారణంగా ఆత్మహత్యలకు పాల్పడి, అర్థరహితంగా తనువు చలిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థులు, యువతలో ఆత్మస్థైర్యాన్ని, స్ఫూర్తిని నింపడానికి జన జాగరణ సమితి స్వామి వివేకానంద స్ఫూర్తి ర్యాలీ నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్ విజయ్‌గోపాల్, డాక్టర్ రమణారావు, జన జాగరణ సమితి రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, స్ఫూర్తి ర్యాలీ ఇన్‌చార్జి సునీల్, గుప్త, నగర కార్యదర్శి దుర్గాప్రసాద్, శైలజా, నవ్య, సాయికిరణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



స్ఫూర్తి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలకు రిఫరీగా కిలాని గణేష్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఈ నెల 20వ తేదీన అమృత్‌సర్‌లో జరగనున్న 9వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలకు వాయు పత్ర హెల్త్ క్లబ్ చీఫ్ కోచ్ కిలాని గణేష్ న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. గణేష్ ఇండియన్ బాడీ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షునిగా, ఏపీ బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలంది స్తున్నారు. జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలకు జడ్జిగా గణేష్ వరుసగా మూడోసారి ఎంపిక కావడం విశేషం, ఆయన ఎంపిక పట్ల ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం, విశాఖ బాడీ లిఫ్టింగ్ సంఘంతో పాటు నగరంలో గల జిమ్ ప్రతినిధులు, కోచ్‌లు, సభ్యులు అభినందనలు తెలిపారు.



లీడర్ ఎంప్లాయిమెంట్ న్యూస్

కృష్ణా యూనివర్సిటీలో బ్యాక్‌లాగ్ టీచింగ్ పోస్టులు

మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ బ్యాక్‌లాగ్/ క్యారీ ఫార్వర్డ్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
వివరాలు...
బ్యాక్‌లాగ్/ క్యారీ ఫార్వర్డ్ టీచింగ్ పోస్టులు: 11
1) అసోసియేట్ ప్రొఫెసర్: 06
విభాగాలు: బిజినెస్ మేనేజ్‌మెంట్-02, ఇంగ్లిష్-01, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్-01, కెమిస్ట్రీ-01, కంప్యూటర్ సైన్స్-01.
2) అసిస్టెంట్ ప్రొఫెసర్: 05
విభాగాలు: బిజినెస్ మేనేజ్‌మెంట్-01, ఇంగ్లిష్-01, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్-01, కెమిస్ట్రీ-01, కంప్యూటర్ సైన్స్-01.
అర్హత: మాస్టర్ డిగ్రీ/ పీహెచ్‌డీ.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.500.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
చివరితేది: 31.01.2018.
చిరునామా: Registrar,
Krishna University, Machilipatnam - 521 001.

అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు

మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
వివరాలు...
అసోసియేట్ ప్రొఫెసర్: 08 పోస్టులు
విభాగాలు: అప్లైడ్ మ్యాథమెటిక్స్-01, బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ-02, కెమిస్ట్రీ-02, ఫిజిక్స్-01, కంప్యూటర్ సైన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్-01.
అర్హత: మాస్టర్ డిగ్రీ/ పీహెచ్‌డీ.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
చివరితేది: 31.01.2018.
చిరునామా: Registrar,
Krishna University, Machilipatnam - 521 001.

15 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
వివరాలు...
అసిస్టెంట్ ప్రొఫెసర్: 15 పోస్టులు
విభాగాలు: అప్లైడ్ మ్యాథమెటిక్స్-04, బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ-01, కెమిస్ట్రీ-05, ఫిజిక్స్-04, ఇంగ్లిష్-01.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000.
దరఖాస్తు హార్డ్‌కాపీల సమర్పణకు చివరితేది: 30.01.2018.
చిరునామా: Registrar,
Krishna University, Machilipatnam - 521 001.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
వివరాలు....
గెస్ట్ ఫ్యాకల్టీ
మొత్తం ఖాళీల సంఖ్య: 07
అర్హత: ఎంబీఏ/ పీహెచ్‌డీ. సంబంధిత రంగంలో 10 సంవత్సరాల అనుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు విధానం: పూర్తి వివరాలతో కూడిన సీవీకి ఇతర ధ్రువపత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.
చివరి తేది: 15.01.2018.
చిరునామా: School Of Management Studies, University Of Hyderabad, Dr.C.R. Rao Road, Central University Post, Hyderabad - 500046.

12నుంచి చెస్ పోటీలు

విజయనగరం, న్యూస్‌లీడర్ : శ్రీగురుకుల్ చెస్ అకాడమి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమి సెక్రటరీ విజయకుమార్ ఒక ప్రకనటలో తెలిపారు. ఈ పోటీలు టీటీడీ కళ్యాణ మండం దరిలో గల గురజాడ సెంట్రల్ లైబ్రరీ, చాసో హాల్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఆసక్తి గలవారు 9440194086, 7386470646 నెంబర్లకు ఫోన్ చేసి మరిన్ని వివరాలకు సంప్రదించ వచ్చని ఆయన కోరారు

అర్ధరాత్రి చిత్ర ప్రదర్శనలు రద్దు చేయాలి

కాండ్రేగుల వెంకటరమణ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: రాష్ట్ర ప్రభుత్వం నిసిగ్గుగా అర్ధరాత్రి దాటాక 'అజ్ఞాతవాసి' చిత్రం ప్రత్యేక ఆటలు ప్రదర్శనకు అనుమతి ఇవ్వడం సమంజసం కాదని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ధ్వజమెత్తారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు. తక్షణం అర్ధరాత్రి దాటాక చిత్ర ప్రదర్శనలను రద్దు చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. ప్రేక్షకుని భద్రతే సినిమా థియేటర్ల పరమావధిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



ఎంఆర్పీ కంటే అధికంగా అమ్మకాలు చేసే సినీ థియేటర్ల యాజమా న్యాలపై తూనికలు కొలతల శాఖ దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సినీ థియేటర్లలో ఒకే రకం వస్తువుకు వేర్వేరు ధరలకు విక్రయించడం చెల్లదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సినిమా థియేటర్లలో వాహనాల పార్కింగ్ పేరుతో జరుగుతున్న దోపిడీని అధికార యంత్రాంగం అరికట్టాలని వెంకటరమణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఐద్వా, సీఐటీయూ సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఐద్వా, సీఐటీయూ అక్కయ్యపాలెం ప్రాంతీయ కమిటీల ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ నగర్‌లో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 96 మంది మహిళలు పాల్గొని రంగురంగుల ముగ్గులతో అలరించి పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగల సందర్భంగా వినోదాలు, వేడుకలు కేవలం ధనవంతులకు తప్ప పేదవారికి అందుబాటులో లేకుండా పోయాయని, గతంలో గ్రామాలలో బంధు మిత్రులతో, పిండి వంటలతో ఎంతో ఉత్సాహంగా పండుగలు జరుపుకునే వారని, కానీ నేడు అదిక ధరలు, చాలీ చాలని వేతనాలతో ప్రజలు సతమవుతున్నారని అన్నారు. ఐద్వా, సిఐటియు గా పోరాటాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధ్యక్షురాలు సూర్యమణి, కార్యదర్శి మాధవి సంయుక్తంగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఆర్.యన్. మాధవి, సిఐటియు నగర నాయకయులు ఆర్.పి. రాజు, యమ్. ప్రదీప్, సిఐటియు అక్కయ్యపాలెం నాయకులు గౌరీష్, స్థానిక తెలుగుదేశం నాయకులు వెంకట్, త్రినాథ్, ఐద్వా నాయకులు యమ్. జయశ్రీ, లలిత, జ్యోతి, సత్యవతి, సుశీల, పద్మ, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో గెలిచిన వారితో పాటు పాల్గొన్న వారందరికీ బహుమతులు ఇవ్వడం జరిగింది.



మట్టి చరియలు విరిగిపడి 13 మంది మృతి



శాంటా బార్బరా : అమెరికాలోని కాలిఫోర్నియాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దక్షిణ కాలిఫోర్నియాలో మట్టిచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 13 మంది మృతిచెందారు. గాయపడ్డ మరో 163 మందిని హాస్పటల్‌కు తరలించారు. శాంటా బార్బరాలోని రోమిరో ప్రాంతంలో సుమారు 300 మంది చిక్కుకున్నారు. మట్టిచరియలు విరిగిపడ్డ ప్రాంతం అంతా యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నది పోలీసులు అన్నారు. ఇదే ప్రాంతంలో నెల రోజుల క్రితం దావానలం వచ్చింది. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వేలాది మంది ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.

పోటీకొస్తే ఓటమి ఖాయం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష పదవికి మీడియా ఎంట్రపెన్యూర్, టెలివిజన్ సలహాదారు ఓప్రా విన్‌ఫ్రీ 'గట్టిగా యోచిస్తున్నారని' ఆమె సన్నిహిత మిత్రులిద్దరు చేసిన ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఆమె కచ్చితంగా అధ్యక్ష రేసులో ఉండరని, ఒక వేళ ఉన్నా ఆమె తన చేతిలో ఓడిపోతారని, తానే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఆది వారం బీవర్లీహిల్స్‌లో గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓప్రా పాల్గొని ఉత్తేజపూరిత ప్రసంగం చేసిన విషయం తెలిసిందే.ఆ తర్వాత విన్‌ఫ్రీ వచ్చే అధ్యక్ష



ఎన్నికల్లో పోటీచేస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. అధ్యక్ష పదవికి పోటీ అంశాన్ని కొన్ని నెలల క్రితం ఓప్రా ప్రస్తావించారని తమ పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆమె మిత్రులిద్దరు చెప్పారు. కాగా, దీనిపై వ్యాఖ్యానించేందుకు విన్‌ఫ్రీ అధికార ప్రతినిధి మాత్రం నిరాకరించారు. అయితే, ఈ విషయంపై ట్రంప్ మాత్రం వెంటనే స్పందించారు. 'ఓప్రాను నేను ఇష్టపడతాను. ఆమె అధ్యక్ష బరిలో దిగుతుందని నేను అనుకోవడం లేదు. ఆమె నాకు బాగా తెలుసు. ఓసారి ఆమె నిర్వహించిన కార్యక్రమంలో కూడా నేను పాల్గొన్నాను. ఒక వేళ ఆమె నిజంగానే బరిలోకి దిగితే నేను కచ్చితంగా ఓప్రాను ఓడిస్తాను' అని ట్రంప్ చెప్పారు.

నాంపల్లి కోర్టుకు యాంకర్ రవి



హైదరాబాద్ : బుల్లితెర వ్యాఖ్యాత రవి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యాడు. 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమా కార్యక్రమంలో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ అతడిపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ నిమిత్తం రవి ఇవాళ ఉదయం కోర్టుకు వచ్చాడు. కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా పడింది.కాగా నాగ చైతన్య నటించిన 'రారండోయ్ వేడుక చూద్దాం' ఆడియో వేడుకలో సీనియర్ నటుడు చలపతిరావు మహిళలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే చలపతిరావు చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ సూపర్ గా చెప్పారు అంటూ వ్యాఖ్యలు చేసిన యాంకర్ రవిపై కూడా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

సాలీడును చంపబోతే..ఇల్లే తగలబడింది..!

ఇంటర్నెట్‌డెస్క్: ఇంట్లోకి చొరబడిన సాలెపురుగును చంపేద్దామని ప్రయత్నించాడు ఓ వ్యక్తి. కానీ పాపం దురదృష్టవశాత్తూ తన ఇంటినే కోల్పోయాడు. దాన్ని చంపడానికి పెట్టిన నిప్పు కాస్తా అతడి ఇల్లు మొత్తం అంటుకుంది. దాని వల్ల అతడికి భారీ నష్టం మిగిలింది. అమెరికాలోని ఉత్తర కాలిఫోర్నియాలో ఈ విచిత్రమైన సంఘటన జరిగింది.రెడ్డింగ్ ప్రాంతంలో నివసించే లెండ్‌సే విసెగార్వర్ అనే వ్యక్తి ఇంట్లోకి స్పైడర్ వచ్చింది. చూడటానికి ఎంతో భయంకరంగా ఉన్న ఆ సాలెపురుగు అతడు పడుకునే బెడ్ మీద పాకడం గమనించాడు. వెంటనే దాన్ని మంట పెట్టి చంపేందుకు ప్రయత్నించాడు. అసలే దూది పరుపు నిప్పు పెట్టడంతో వెంటనే అంటుకుపోయింది. ఇక అది కాస్తా ఆ గదిలో ఉన్న కర్టన్లకు అన్నింటికీ వ్యాపించింది. దీంతో అతడు వెంటనే అగ్నిమాపక దళాలకు ఫోన్ చేశాడు. వాళ్లు వచ్చి అర గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే జరగాల్సిన ఘోరం కాస్తా జరిగిపోయింది.

దాదాపు 11వేల డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. అంటే మన కరెన్సీలో రూ.7లక్షల న్నమాట.



ఓ స్పైడర్ చంపడానికి పెట్టిన చిచ్చు కారణంగా అతడికి తడిసిమోపెడైంది.

చేపలకు అందాల పోటీ..!

ముద్దుగుమ్మలు, బొద్దుగుమ్మలకు అందాల పోటీలు నిర్వహించడం చూస్తూనే ఉంటాం. ఇటీవల కాలంలో అయితే.. శునకాలు, పిల్లులకు అందాల పోటీలు పెట్టేస్తున్నారు. వినూత్నమైన దుస్తులతో అవి చేసే సందడి, వాటి ప్రదర్శనను బట్టి అందులో అందమైన వాటిని ఎంపిక చేసారు. ఇప్పుడు చేపలకు అందాల పోటీలు నిర్వహించారు. అదేంటీ.. చేపలకు అందాల పోటీలు ఎలా పెడతారు.. అని అనుకుంటున్నారా? కానీ పెట్టారు. అంతేకాదు.. ఆ అందాల పోటీలో నెగ్గిన చేప ఇక్కడ భారీ ధర పలుకుతుంది.జపాన్‌లో 'కోయి' ఫిష్ అంటే తెలియని వారుండరు. కొన్ని దశాబ్దాలుగా ఆ చేప అక్కడ ఫేమస్. అంతేకాదు.. ఈ చేపల ధర కూడా బాగా ఎక్కువగా ఉంటుంది. ఇటీవల టోక్యోలో ఈ రంగు రంగుల చేపలకు అందాల పోటీ నిర్వహించారు. కొన్ని వాటర్ టబ్స్‌లో వీటిని వేసి అందాల పోటీకి సిద్ధం చేశారు. వాటిని న్యాయనిర్ణేతలు చూసి అందంగా ఉన్న చేపను ఎంపిక చేసి విజేతగా ప్రకటించారు. ఇంద్రధనస్సులోని ఏడు రంగులు వీటి శరీరంపై ఉంటాయి. అంతా..



బాగానే ఉంది కానీ మరి వాటిని అందాల పోటీలో విజేతగా ఎలా ఎంపిక చేస్తారని అనుకుంటున్నారా? అదెలాగంటే.. కోయి చేపల్లోని వంపులే వాటికి అందం. అవి ఎంత వంపు తిరిగి ఉంటే.. వాటి అందం అంతగా కనిపిస్తుంది. ఈ అందాల పోటీలో కూడా దాన్నే ప్రధాన ప్రామాణికంగా తీసుకున్నారు. 60శాతం మార్కులు ఆ చేపల వంపుకే కేటాయిస్తారు. ఇక మిగతా 30 శాతం మార్కులు ఆ చేపల రంగు, వాటి ఆకర్షణకు ఉంటాయి.

మిగతా 10శాతం మార్కులు మాత్రమే న్యాయనిర్ణేతల చేతుల్లో ఉంటాయి. వాటిని జడ్జీలు పరిశీలించి.. వాళ్లకి నచ్చి నట్లుగా మార్కులు వేస్తారు. అలా ఏ చేప అయితే.. ఎక్కువ మార్కులు తెచ్చుకుంటుందో ఆ చేపను అందాల పోటీలో విజేతగా ప్రకటిస్తారు. ఈ గెలిచిన చేప ధర అక్కడి మార్కెట్‌లో సుమారు కొన్ని వేల డాలర్లలో ధర పలుకుతుంది. ఈ చేపల అందాల పోటీలను వీక్షించేందుకు సందర్శకులు కూడా భారీగానే రావడం విశేషం.

స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం

ఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్ మరోసారి సత్తా చాటింది. స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించి చరిత్ర సృష్టించింది హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలికి చెందిన 21 ఏళ్ల అంచల్ ఠాకూర్. టర్కీలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ స్కీ(ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో అల్పైన్ ఎజ్డర్ 3200 కప్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో భాగంగా మంగళవారం స్లాలోమ్ రేస్ కేటగిరీలో పాల్గొన్న అంచల్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. స్కీయింగ్‌లో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి.ఈ సందర్భంగా అంచల్ తన ట్విటర్ ద్వారా పతకం గెలిచిన ఫొటోలను పంచుకుంది. 'చివరిగా ఊహించనిది జరిగింది. ఇది నా తొలి అంతర్జాతీయ పతకం. టర్కీలో



ఎఫ్ఐఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో మంచి ప్రదర్శన చేశాను' అని పేర్కొన్న అంచల్.. వన్ హిమాచల్, హిమాలయన్ గర్ల్ అని హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టింది.కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ట్విటర్ ద్వారా అంచల్‌కు అభినందనలు తెలిపారు. 'టర్కీలో నిర్వహించిన ఎఫ్ఐఎస్ ఇంటర్నేషనల్ స్కీయింగ్ పోటీల్లో కాంస్యం గెలిచిన అంచల్ ఠాకూర్‌కు అభినందనలు. స్కీయింగ్ విభాగంలో భారత్ పతకాల ఖాతాను తెరిచింది' అని పేర్కొన్నారు. అంచల్ స్కీయింగ్‌ను మొదట తన తండ్రి నుంచే నేర్చుకుంది. ఆ తర్వాత మాజీ ఒలింపిక్ పతక విజేత హీరా లాల్ వద్ద శిక్షణ పొందుతోంది.

ఈ సందర్భంగా అంచల్ తండ్రి రోషన్ మాట్లాడుతూ..'ఈవెంట్ అనంతరం అంచల్ నాకు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి పతకాన్ని చూపించింది. ఎఫ్ఐఎస్ ఈవెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికి ఇచ్చే ప్రోత్సాహక పతకం అని అనుకున్నాను. కానీ, ఆమె తాను కాంస్య పతకం గెలిచినట్లు చెప్పింది. చాలా ఆనందంగా ఉంది' అని ఆయన తెలిపారు.

నెలాఖరున మోదీ, ట్రంప్ భేటీ!

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెలాఖరులో భేటీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. జనవరి చివరి వారంలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ జరగనుంది. ఈ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి ప్రముఖ నేతలు, ఆర్థిక వేత్తలు హాజరవుతారు.

అమెరికా నుంచి ట్రంప్, భారత్ నుంచి మోదీ కూడా ఈ సదస్సులో పాల్గొననున్నారు. సమావేశాల్లో భాగంగా వీరు ఇరువురు భేటీ అయ్యే అవకాశాలున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాల సమాచారం.సదస్సు నిమిత్తం ప్రధాని మోదీ జనవరి 22న స్విట్జర్లాండ్ వెళ్లనున్నారు. రెండో రోజుల పాటు



మోదీ అక్కడ పర్యటిస్తారు. ఈ సందర్భంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్లీనరీ సెషన్లో ప్రధాని కీలక ప్రసంగం చేయనున్నారు.1997 తర్వాత ఓ భారత ప్రధాని దావోస్ సదస్సులో పాల్గొనడం మళ్లీ ఇప్పుడే.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

కా గా..దాదాపు 18ఏళ్ల తర్వాత ఓ అమెరికా అధ్యక్షుడు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. దీనిపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి సారా శాండర్స్ మీడియాతో మాట్లాడారు. అధ్యక్షుడు ట్రంప్ తన అమెరికా ఫస్ట్ ఎజెండాను ప్రపంచ నేతలతో పంచుకునేందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సరైన వేదిక అని ఆమె చెప్పారు.

మోదీ సంస్కరణలపై వరల్డ్‌బ్యాంక్ ప్రశంసలు



వాషింగ్టన్: భారత ఆర్థిక ప్రగతిపై వరల్డ్ బ్యాంక్ ప్రశంసలు కురిపించింది. ఈ ఏడాది భారత ఆర్థిక ప్రగతి 6.7 శాతం ఉంటుందని వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది. భారత ప్రభుత్వం వేసిన అంచనా కన్నా ఎక్కువే ఇది. ఈ ఏడాది ఆర్థిక ప్రగతి 6.5 శాతం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. 2018-19 సంవత్సరంలో జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) కూడా 7.3 శాతం ఉంటుందని వరల్డ్ బ్యాంక్ తన నివేదికలో పేర్కొన్నది. భారత్ మళ్లీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక దేశమని గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్‌లో వరల్డ్ బ్యాంక్ స్పష్టం చేసింది. జీఎస్టీ వల్ల వృద్ధి రేటు గత ఏడాది రెండవ భాగంలో సుమారు 0.1 శాతం తగ్గినట్లు రిపోర్ట్ పేర్కొన్నది. 2019-20లో జీడీపీ 7.5 శాతం ఉంటుందని కూడా ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. జీఎస్టీ వల్ల లాభాలు మెలమెల్లగా వస్తుంటాయని వరల్డ్ బ్యాంక్ పేర్కొన్నది. ప్రపంచదేశాలపైన కూడా వరల్డ్ బ్యాంక్ తన నివేదికను వెల్లడించింది. ఆర్థిక సంక్షోభం నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్నదని వరల్డ్ బ్యాంక్ తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మంచి సందేశాన్ని అందిస్తున్నా, నిర్లిప్తంగా వ్యవహరించరాదు అని వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ జిమ్ యంగ్ కిమ్ తెలిపారు. పెట్టుబడులకు ఇది శుభతరుణమన్నారు. మరో పాజిటివ్ అంశాన్ని కూడా వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది. గ్లోబల్‌గా ట్రేడ్ రికవరీ పెరగనున్నట్లు, దీంతో ఎగుమతులు కూడా పెరుగుతాయని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. నోట్ల రద్దు, జీఎస్టీ, మేకిన్ ఇండియా లాంటి కార్యక్రమాల వల్ల భారత్‌కు అనుకూల ఫలితాలు వచ్చే సూచనలు ఉన్నట్లు వరల్డ్ బ్యాంక్ అంచనా వేసింది. మేకిన్ ఇండియా వల్ల ఆవిష్కరణలు, పెట్టుబడులు పెరుగుతాయని వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది.

వినియోగదారుల కోసం 'గూగుల్ పే'

గూగుల్ సంస్థ నుంచి నూతన చెల్లింపుల ప్లాట్‌ఫాం

G Pay

ముంబయి: డిజిటల్ పేమెంట్స్ మార్కెట్‌లో నిత్యం ఏదో ఒక నూతన ఆవిష్కరణ జరుగుతూనే ఉంది. ప్రజలకు నగదు రహిత చెల్లింపులను సులభతరం చేస్తూ వివిధ సంస్థలు యాప్‌ల రూపంలో అనేక సౌలభ్యాలను కలిగిస్తున్నాయి. గూగుల్ వ్యాలెట్, ఆండ్రాయిడ్ పే.. ఈ రెండింటినీ ఏకం చేస్తూ గూగుల్ పే పేరుతో నూతన చెల్లింపుల ప్లాట్‌ఫామ్‌ను భారత్‌లో ఆవిష్కరిస్తున్నట్లు గూగుల్ సంస్థ వెల్లడించింది. గూగుల్ పే ద్వారా చేసిన చెల్లింపుల వివరాలన్నీ సంబంధిత వ్యక్తి గూగుల్ ఖాతాలో అందుబాటులో ఉంటాయని సంస్థ ఉత్పత్తుల మేనేజ్‌మెంట్ ఉపాధ్యక్షుడు పాలి భట్ తెలిపారు. ఆండ్రాయిడ్ పే తక్కువ కాలంలోనే అనేక మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లతో అనుసంధానమైందని, ఇదే విధంగా గూగుల్ పే కూడా ఉంటుందనన్నారు. డైన్, ఫన్‌డాంగో, హంగ్రీ హౌస్, ఇన్‌స్టాకార్ట్, మరిన్ని ఇతర యాప్‌లు ఇప్పటికే గూగుల్ పే సేవలను ఉపయోగించుకుంటున్నాయన్నారు. గూగుల్ ఈ మధ్య కాలంలో వినియోగదారుల కోసం తేజ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గూగుల్ పేలో ఉన్న అన్ని నూతన సౌకర్యాలను తేజ్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోచిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే దీనిపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

హవ్వ! ఫుట్‌బాల్ మ్యాచ్ ఇలాగా!

"ఒక్కొక్కరినీ కాదు వందమందిని ఒకేసారి పంపు"

టోక్యో: 'ఒక్కొక్కరినీ కాదు షేర్ ఖాన్.. వందమందిని ఒకేసారి పంపు' అని మగధీరలో రామ్‌చరణ్ చెప్పిన డైలాగ్ గుర్తుంది కదా. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే.. ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఒక జట్టు తరఫున వందమంది ఆటగాళ్లు పాల్గొనగా ప్రత్యర్థి జట్టు నుంచి ముగ్గురు మాత్రమే పాల్గొన్నారు. ఇంతకీ ఈ మ్యాచ్ ఎక్కడ నిర్వహించారు. ఈ పోరులో ఎవరు గెలిచారో చూద్దాం.సాధారణంగా ఫుట్‌బాల్ మ్యాచ్ అంటే ఒక్కో జట్టు తరఫున 11 మంది...అంటే రెండు జట్లతో కలిపి మైదానంలో 22 మంది ఆడటం మనం చూశాం. కానీ, జపాన్‌లో నిర్వహించిన ఓ మ్యాచ్‌లో ఒక జట్టు నుంచి ఏకంగా 100మంది పాల్గొనగా.. రెండో జట్టు నుంచి కేవలం ముగ్గురు మాత్రమే పాల్గొన్నారు. వంద మంది ఆటగాళ్లతో పోటీపడి చివరికి గోల్‌కొట్టి విజయం సాధించింది ముగ్గురు ఆటగాళ్ల జట్టు. ఈ ముగ్గురు జపాన్ తరఫున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లు హొటారు యమగూచి, హిరోషి కియోటకే, యోసుకి ఇడిగూచి కాగా ఆ వంద మంది ఆటగాళ్లు పాఠశాల విద్యార్థులు కా



వడం విశేషం. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఏటా జపాన్‌లో ఇలా పాఠశాల విద్యార్థులతో పోటీ నిర్వహించడం ఆనవాయితీ.

మైదానంలో మూడు అంచెల్లో 30-30-30 చొప్పున బంతిని అడ్డుకునేందుకు సిద్ధమవ్వగా మిగతా పది మంది గోల్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. వంద మంది నుంచి బంతిని చాకచక్యంగా తప్పించి తీసుకొచ్చిన ముగ్గురు ఆటగాళ్లు చివరకు గోల్ కొట్టి విజయం సాధించారు. ఈ వీడియోను మీరూ చూడండి.

పాక్ రహస్యాలన్నీ భారత్‌కు చెప్పేశానా.?

పెళ్లి వార్తలపై మండిపడ్డ ఇమ్రాన్‌ఖాన్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ క్రికెటర్, ప్రతిపక్ష తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ మూడో పెళ్లి చేసుకున్నారంటూ ఇటీవల వరుసగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఇమ్రాన్ తాను ఇంకా మూడోపెళ్లి చేసుకోలేదని.. కానీ పెళ్లి ప్రతిపాదన మాత్రం చేసినట్లు వెల్లడించారు.

ఇంత వివరణ ఇచ్చాక కూడా అక్కడి మీడియా తన పెళ్లి వార్తల ప్రసారాన్ని ఆపకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. ట్విటర్ వేదికగా ఈ విషయంపై తీవ్రంగా మండిపడ్డారు.'గత మూడు రోజులుగా వస్తున్న వార్తలను చూసి ఆశ్చర్య పోతున్నా. నేనేమైనా బ్యాంకును చోరీ చేశానా.. లేదా జాతీయ సంపద దోచుకున్నానా..

లేదంటే పాక్ రహస్యాలన్నీ భారత్‌కు చెప్పేశానా..? ఇందులో నేనేమీ చేయలేదు. మూడో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. దాన్నే



పెద్ద నేరంగా చూస్తున్నారెందుకు? నా గురించి ఆలోచించకుండా ఈ మీడియా దీనిపై ఎందుకు ఇంత ప్రచారం చేస్తోంది. కానీ నా బాధంతా నా పిల్లలు, బుష్రా బేగం కుటుంబం గురించే.

ఈ వార్తల్లోకి వాళ్లనెందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదు' అంటూ వరుస ట్వీట్లతో ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై కూడా ఇమ్రాన్ వ్యాఖ్యలు చేశారువారు వెనుకుండి తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నవాజ్ కుటుంబం తనకు 40ఏళ్లుగా తెలుసని..


వారి కుటుంబ రహస్యాలను తాను బయట పెట్టలేదుగా అన్నారు. వ్యక్తిగత ఆనందం కోసమే తాను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని.. అలహక్కు తనకు ఉందన్నారు.ఇమ్రాన్ ఖాన్ రహస్యంగా మూడోపెళ్లి చేసుకున్నారని ఇటీవల వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఇమ్రాన్.. ఈ వార్తలు ఖండించారు.

బుష్రా అనే మహిళకు తాను పెళ్లి ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అయితే ఆమె కొంచెం సమయం కోరారని, అంగీకారం లభిస్తే పెళ్లి చేసుకుంటానని

గడ్డకట్టే చలిలో మొసలి కష్టాలు



వాషింగ్టన్ :అమెరికాలో ప్రస్తుతం నదులు, సరస్సులు, కొలనులు అన్ని గడ్డకట్టుకుపోయాయి. దీంతో వాటిలో నివసించే జంతువుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చేపలు, కప్పల పరిస్థితి పక్కన పెడితే ఉభయచరాలైన మొసళ్ల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. గడ్డ కట్టే చలి నుంచి అవి ఎలా రక్షణ పొందుతాయో తెలిపే వీడియో ఒకటి ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇందులో గడ్డకట్టిన నీటి ప్రాంతంలో మొసళ్ల ముక్కులు మాత్రం బయటికి ఉండటం చూడొచ్చు.నిజానికి ఇది ఒక రకమైన సుప్తావస్థ పరిస్థితి. సాధారణంగా శీతల రక్తం గల జంతువులు ఇలా చలికాలం పూట సుప్తావస్థకు వెళ్తాయి. ఈ సమయంలో వాటి జీవక్రియారేటు తగ్గిపోతుంది. నేల మీద ఉండే జీవులు బొరియల్లో, చెరియల్లో తలదాచుకుంటాయి. కానీ భారీ శరీరం కారణంగా మొసళ్లకు ఆ అవకాశం చాలా తక్కువ. దీంతో ఇలా గాలి కోసం ముక్కులు బయటపెట్టి, గడ్డ కట్టిన నీటిలో వేలాడుతుంటాయి. అమెరికాలో ఉత్తర కరోలినాలో ఉన్న షార్లెట్ రివర్ స్వాంప్ పార్క్‌లో ఈ దృశ్యం కనిపించింది



త్రివిక్రమ్ మార్క్ మిస్సింగ్

కొన్ని కాంబినేషన్లకు పరిచయాలు.. ఉపోద్ఘాతాలు అక్కర్లేదు. అలాంటి వాళ్లలో పవన్‌కల్యాణ్-త్రివిక్రమ్ ముందు వరుసలో ఉంటారు. వారిద్దరూ కలిసి ఓ సినిమా చేస్తున్నారంటేనే అంచనాలను అందుకోవడం కష్టం. ఈ విషయాన్ని 'జల్సా', 'అత్తారింటికి దారేది' నిరూపించాయి. ఇప్పుడు 'అజ్ఞాతవాసి'తో మరోసారి తమ సత్తా చాటేందుకు వచ్చారు. అంతేకాదు ఇది పవన్ నటించిన 25వ చిత్రం కూడా కావడం మరో విశేషం. టీజర్‌ను చూసి క్లాసికల్ మూవీ అనుకున్న వారికి ట్రైలర్‌లో 'ఓ మినీ యుద్ధమే' చూపించి సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. మరి సంక్రాంతి బరిలో దిగిన 'అజ్ఞాతవాసి' కథేంటి? పవన్-త్రివిక్రమ్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టిందా?

కథేంటంటే: ప్రముఖ వ్యాపారవేత్త, ఏబీ గ్రూప్ అధినేత గోవింద భార్గవ్ అలియాస్ విందా(బొమన్‌ఇరానీ), అతని కుమారుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేస్తారు. తనకు వారసులు లేరని అనుకోకుండా విందా భార్య ఇంద్రాణి(ఖుష్బూ) కంపెనీ వ్యవహారాలు చూసుకునేందుకు ఓ యువకుడిని (పవన్‌కల్యాణ్) అసోం నుంచి పిలిపిస్తుంది. అతను బాలసుబ్రహ్మణ్యం పేరుతో ఏబీ గ్రూప్‌లో పర్సనల్ మేనేజర్‌గా చేరతాడు. కంపెనీ వ్యవహారాలు చూసుకుంటూ విందా హత్యలకు కారకులైన వారి కోసం అన్వేషిస్తుంటాడు. మరి ఆ హత్యలు చేసింది ఎవరు? ఎందుకు చేశారు? ఇందులో సీతారామ్(ఆది పినిశెట్టి) పాత్ర ఏంటి? అసలు అసోం నుంచి వచ్చింది నిజంగా బాల సుబ్రహ్మణ్యమేనా? 'అజ్ఞాతవాసి'గా అతను ఎందుకు వచ్చాడు? బాల సుబ్రహ్మణ్యంగా వచ్చిన వ్యక్తి అభిషిక్త భార్గవ ఎలా అయ్యాడు? అతనికి విందా కుటుంబానికి సంబంధం ఏంటి?

ఎలా ఉందంటే : 'అజ్ఞాతవాసి' నూటికి నూరుపాళ్లు పవన్-త్రివిక్రమ్ కాంబో మూవీ. అందులో ఎలాంటి సందేహం లేదు. కార్పొరేట్ వ్యవహారాలు, అందులో ఒకరిపై ఒకరి ఆధిపత్య పోరు.. ఎత్తులు, పైఎత్తులు మొదలైన అంశాల చుట్టూ ప్రధానంగా ఈ కథ నడుస్తుంది. చదరంగం లాంటి అందులో ఎవరు విజేతగా నిలిచారన్నది ఈ కథలో ప్రధాన ఎలిమెంట్. దర్శకుడు కథను నడిపించేందుకు పురాణ, ఇతిహాసాల్లోని అంశాలను నేపథ్యంగా తీసుకున్నాడు. 'నకుల ధర్మం' ప్రస్తావన అందులోని భాగమే. కూర్చునే కుర్చీ తయారవడానికి జరిగే పోరాటం గురించి తొలి సన్నివేశాల్లో కథానాయకుడు చెప్పటం బట్టి.. కథ అంతా ఒక పోరాటం దిశగా సాగుతుందని అర్థం చేసుకోవచ్చు. ఈ పోరాటానికి కుటుంబ బంధాలు, పిట్ట కథల్లాంటి ప్రేమ వ్యవహారం, కొన్ని వినోద సన్నివేశాలను అతికించుకుంటూ వెళ్లాడు దర్శకుడు.

నటీనటులు: పవన్‌కల్యాణ్.. బొమన్ ఇరానీ.. ఖుష్బూ.. ఆది పినిశెట్టి.. కీర్తిసురేష్.. అను ఇమ్మాన్యుయేల్.. తనికెళ్ల భరణి.. మురళీ శర్మ.. రావు రమేష్.. వెన్నెల కిషోర్.. రఘుబాబు తదితరులు
సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్
ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు
ఛాయాగ్రహణం: వి.మణికందన్
కళ: ఏఎస్ ప్రకాష్
దర్శకత్వం: త్రివిక్రమ్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పీడీవీ ప్రసాద్
నిర్మాత: ఎస్.రాధాకృష్ణ(చినబాబు)
బ్యానర్: హారిక అండ్ హాసిని క్రియేషన్స్
విడుదల తేదీ: 10-01-2018

దీంతో కథను నెమ్మదిగా ప్రారంభించి విరామ సన్నివేశాలు వచ్చే సమయానికి పలు చిక్కు ముడులను పెట్టి ప్రేక్షకుడిలో ఉత్కంఠ రేకెత్తించాడు. అక్కడి నుంచే అసలు కథ మొదలవుతుంది. హత్యలకు కారణమెవరో తెలుసుకున్న బాల సుబ్రహ్మణ్యం వారిని ఏ విధంగా మట్టుబెట్టాడన్నది ద్వితీయార్ధం. ఇంటర్వెల్ ముందు వచ్చే ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో పవన్ ఎంట్రీ ఆకట్టుకుంటుంది. విందాను హత్య చేసి, అతని వ్యాపార సామ్రాజ్యాన్ని కూల్చలనుకున్నది ఎవరు? అనే అంశం చుట్టూ ద్వితీయార్ధం నడిచింది. ఈ క్రమంలో కథానాయకుడు ఎదుర్కొన్న పరిస్థితులను చూపించాడు దర్శకుడు. దీంతో పాటు విందా కంపెనీలో శర్మ(మురళీశర్మ) వర్మ(రావురమేష్)ల పాత్రలతో హాస్యాన్ని పండించే ప్రయత్నం చేశాడు. త్రివిక్రమ్ శైలి కామెడీ అందరికీ నవ్వులు పంచుతుంది. ఆయా సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. పతాక సన్నివేశాలను తనదైన మార్కు జోడించి తీర్చిదిద్దాడు త్రివిక్రమ్. పవన్ పాడిన 'కొడకా కోటేశ్వరరావు' నవ్వుల పువ్వులు పూయిస్తుంది.

ఎవరెలా చేశారంటే: ఇది పూర్తిగా కథానాయకుడి చుట్టూ తిరిగే కథ. బాలసుబ్రహ్మణ్యం, అభిషిక్త భార్గవగా పవన్ తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. డైలాగులు, యాక్షన్ సన్నివేశాల్లో పవన్ మార్కు కనపడుతుంది. 'స్టాలిన్' తర్వాత ఖుష్బూకు మరో మంచి పాత్ర దక్కింది. ద్వితీయార్ధంలో ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో ఆమె నటన ఆకట్టుకుంటుంది. మురళీశర్మ, రావు రమేష్‌లు వినోదానికే పరిమితమయ్యారు. కథానాయికల పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం లేదు. అయితే అందంగా కనిపించారు. ఆది పినిశెట్టి నటన పర్వాలేదనపిస్తుంది. కథానాయకుడి స్థాయికి తగ్గట్టు ప్రతినాయకుడి పాత్రను తీర్చిదిద్ది ఉంటే ఇంకా బాగుండేది. రాముడిలాంటి వ్యక్తిత్వం ఉన్న కథానాయకుడి పాత్ర ఎలివేట్ కావాలంటే రావణాసురుడి వంటి బలమైన ప్రతినాయకుడు ఉండి తీరాలి. ఆ లోటు ఇందులో కనిపిస్తుంది. ప్రతినాయకుడైన సీతారామ్ పాత్రను మరింత బలంగా తీర్చిదిద్ది ఉంటే అభిషిక్త భార్గవ పాత్ర ఇంకాస్త ఎలివేట్ అయ్యేది.

సాంకేతికంగా..

సంగీత దర్శకుడిగా తెలుగులో అనిరుధ్ తొలి సినిమా అయిన 'అజ్ఞాతవాసి' గ్రాండ్ లాంచ్ అనే చెప్పాలి. చక్కని పాటలను అందించాడు. నేపథ్య సంగీతం పర్వాలేదు. అక్కడక్కడా మెరుపులు కనిపిస్తాయి. వి.మణికందన్ కెమెరా పనితనం బాగుంది. పవన్‌కల్యాణ్ పరిచయ సన్నివేశం సినిమాకు ప్రధాన ఆకర్షణ. యాక్షన్ సన్నివేశాలను ముఖ్యంగా బల్గేరియాలో ఛేజింగ్ సన్నివేశాలను చిత్రీకరించిన విధానం బాగుంది. 'మాటల మాంత్రికుడి'గా పేరు తెచ్చుకున్న దర్శకుడు త్రివిక్రమ్ మరోసారి తన మార్కును చూపించాడు. అయితే దర్శకుడి కన్నా త్రివిక్రమ్‌లోని రచయితకు ఎక్కువ మార్కులు పడతాయి. ఇక శర్మ-వర్మ సంభాషణల్లో త్రివిక్రమ్ శైలి హాస్యం నూటికి నూరు పాళ్లు కనిపిస్తుంది. ప్రథమార్ధంలో వచ్చే డైలాగుల్లో డెప్త్ ఉంది. 'విచ్చలవిడిగా నరికేస్తే హింస... విచక్షణతో నరికేస్తే ధర్మం' వంటి డైలాగ్‌లు ఆకట్టుకుంటాయి. అయితే కథ, కథనాలపై మరింత దృష్టి పెడితే బాగుండేది. పవన్-త్రివిక్రమ్ హిట్ కాంబినేషన్ కావడంతో నిర్మాత ఎక్కడా రాజీపడలేదు. ప్రతీ సన్నివేశంలో రిచ్‌నెస్ కనిపిస్తుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

బలాలు :
- పవన్ కల్యాణ్ పాత్ర చిత్రీకరణ
- విరామానికి ముందు వచ్చే సన్నివేశాలు
- ద్వితీయార్ధంలో కొన్ని హాస్య సన్నివేశాలు
- కొడకా కోటేశ్వరరావు పాట

బలహీనతలు
- అక్కడక్కడా 'అత్తారింటికి దారేది' గుర్తుకు రావడం
- కథ, కథనాలు బలంగా లేకపోవడం

చివరిగా: 'అజ్ఞాతవాసి' అభిమానులకే పండగ

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే.




స్వాతి ప్రమోటర్స్ సీనియర్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మంగళవారం ఉదయం కంబాల కొండ ట్రెక్కింగ్ ప్రముఖ యోగా నిపునురాలు లావణ్య కోడూరు గారి ఆధ్వర్యంలో జరిగింది. - న్యూస్‌లీడర్ / విశాఖపట్నం

ఘనంగా సన్ నొవొటో ఫ్రెషర్స్ డే వేడుకలు

అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు

డాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: టూరిజం హబ్‌గా విశాఖ అభివృద్ధి చెందుతున్న తరుణంలో హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలోని ప్రస్తుతం విస్తృతమైన అవకాశాలు వున్నాయని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనువాసురావు అన్నారు. సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ సంస్థ బుధవారం బీచ్‌రోడ్డు స్థానిక హోటల్‌లో నొవొటో పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రితో పాటు ఆయన సతీమణి గంటా శారదా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు మంత్రి గంటా మాట్లాడుతూ సన్ ఇంటర్నేషనల్ సంస్థ హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం హోటల్ మేనేజ్‌మెంట్‌తో పాటు టూరిజం సేవలుకూడా అందించడం ద్వారా సంస్థ ఏ స్థాయిలో అభివృద్ధిలో పయనిస్తోందో అర్థంచేసుకోవచ్చునన్నారు. సంస్థ సీఎండీ శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులందరూ కూడా ప్రపంచ వ్యాప్తంగా స్టార్ హోటల్స్‌లో రాణిస్తురన్నారు. 14వ ఫ్రెషర్స్ డే జరుపుకోవడం ఎంతో ఆనందాయకమన్నారు. డైరక్టర్ ఆశాజాస్తి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతస్థాయిలో చూడాలనే ఉద్దేశ్యంతో ముందకెళ్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యారులు, , తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంటా సతీమణి శారదా

సమాజ రక్షణకు పౌర రక్షణ దళం సేవలు

213 బ్యాచ్‌లో 61 మందికి శిక్షణ ● ఆకట్టుకున్న వాలంటీర్లు విన్యాసాలు





విశాఖపట్నం, న్యూస్‌లీడర్:

పౌర రక్షణ దళం సేవలు సమాజ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని విశాఖ జిల్లా అగ్నిమాపక అధికారి బి.వి.ఎస్.రామ్‌ప్రకాష్ పేర్కొన్నారు. గురుధార్ జంక్షన్ శాంతిపురంలోని పౌర రక్షణ కార్యాలయంలో బుధవారం ఉదయం 213వ బ్యాచ్ పౌర శిక్షణ వాలంటిర్‌లు శిక్షణా కార్యక్రమం ముగింపు పేరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన ముందుగా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర రక్షణ సంస్థలో శిక్షణ పొందినవారు ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్వచ్ఛందంగా వచ్చి ప్రభుత్వ కార్యకలాపాలలో తప్పనిసరిగా పాల్గొనాలని వాలంటీర్లకు సూచించారు. వాలంటరీలు ధైర్యం, నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ప్రకృతి సమతుల్యతను పాటించడం ద్వారా విపత్తులను నివారించవచ్చునన్నారు. పౌర రక్షణశాఖ డిప్యూటీ సీడీ కంట్రోలర్ జి.జవహార్‌లాల్ నెహ్రూ మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లో 61 మందికి శిక్షణ అందజేశామని తెలిపారు. అనంతరం పౌర రక్షణ దళం వాలంటర్లు విన్యాసాలు ప్రదర్శించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు ఆర్పడం, ఎత్తైన భవనాలలో చిక్కుకున్న వార్ని సురక్షితంగా కిందకు తీసుకు రావడం, వారికి ప్రథమ చికిత్స చేయడం తదితర విన్యాసాలు అత్యంత చాకచక్యంతో అద్భుతంగా చేసి చూపించారు. అత్యవసర సమయాల్లో బాధితులను ఏ విధంగా కాపాడాలో, ఎటువంటి చికిత్స చేయాలో చేశారు. యుద్ధ సమయాల్లో రక్షణకు అనుపరించవలసిన పద్ధతులను కూడా చేశారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ పి.రామారావు, యూఎన్‌డీపీ ఎన్.శ్రీనివాస రాజామణి, వైద్య, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

బుచ్చెయ్యపేట,న్యూస్‌లీడర్:
రాజాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జన్మభూమిలో భాగంగా ఆయన అధ్యక్షతన రాజాంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో ప్రత్యేకాధికారి కేశవపాండే, ఎంపీడీఓ కొండలరావు, తహశీల్దార్ కేవివి శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి: ఎమ్మెల్యే


సర్పంచ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

మాడుగుల, న్యూస్‌లీడర్:
కేజేపురం గ్రామ అభివృద్ధి తన వంతు సహకారం అందిస్తానని జిల్లా ప్రవీణ్‌కుమార్ అన్నారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా పాల్గొని మాట్లాడుతూ కేజేపురం గ్రామంలో ఉన్న సమస్యలను సర్పంచ్ పెంటకోట అప్పారావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తిగా నిలిచిపోయిన కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని, పంచాయతీ భవనం పూర్తిగా శిథిలమై వర్షాకాలంలో కారిపోయి ఫైళ్లు తడిచిపోతున్నాయని, నూతన పంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంచినీటి సమస్య కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, గ్రామం అన్ని వీధులలో జీఏ పైపుల ద్వారా మంచినీరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సర్పంచ్ పెంటకోట అప్పారావు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో రాపేటి జోగినాయుడు, రాపేటి గోవింద, కర్రి నాగమణి, అల్ల శివకుమార్, అల్ల సంతోష్‌కుమార్, వేగి గాంధీ పాల్గొన్నారు.

కె.కోటపాడులో.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఐదోవిడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా ఎనిమిదోరోజైన మండలపరిధి సూదివలస, పాతవలస గ్రామాల్లో తహశీల్దార్ బి.వి.రాణి, అర్లి, గుల్లేపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ సిహెచ్. సుబ్బలక్ష్మిలు గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు యాళ్ళ సింహాచలంనాయుడు, జామి భవానీ, బోశెం అక్కన్నపాత్రుడు (బుల్లిదొర),వేలచవు మల్లికాదేవిల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. సభల్లో ఎంపీటీసీ సభ్యులు జామి వెంకటలక్ష్మి, బండారు దేముళ్ళు ఈఓపీఆర్‌డి సింగంపల్లి అప్పారావు, ఎంఈఓ టి.మధుమూర్తి, జలవనరుల శాఖ ఏఈఈ జి.సత్యంనాయుడు, ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్. ఏఈ జి.లక్ష్మణరావు, మండల ఇంజినీరింగ్ అధికారి మహంతి సుధాకర్, వెలుగు ఏపీఎం బండారు చంద్రకళ, ఏఓ కె.వి.రాంప్రసాద్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీఓ అమరపల్లి భాగ్యలతశ్రీ, టీడీపి నాయకులు జేసీబీ నాయుడు, మతల తాతబాబు, బండారు ప్రసాద్, బండారు నారాయణమూర్తి పాల్గొన్నారు.

కొత్తూరు గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రథమ ధ్యేయం: ఎమ్మెల్యే

కొత్తూరు పంచాయతీని తాను అధికారం చేపట్టాక నాలుగు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఐదవ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ వరద ముంపుతో బాధపడిన ఈ గ్రామాన్ని వరద భారీ నుంచి గట్టెక్కించానని, ఇందులో భాగంగా 25లక్షల రూపాయల వ్యయంతో దొంగగెడ్డ కాలువను అభివృద్ధి చేశానన్నారు. స్వచ్ఛభారత్‌లో కొత్తూరు గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని ప్రతీ ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చంద్రన్నబాటలో భాగంగా కోట్లాది రూపాయల నిధులతో రోడ్లను నిర్మించుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గల రోడ్ల అభివృద్ధి ఈ ఏడాది మారు నాలుగుకోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. కొత్తూరు గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తూరు ప్రధాన రహదారిని రెండు కోట్ల రూపాయల నిధులతో డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. సత్యనారాయణపురం


మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

వెళ్లే రహదారిని కూడా డబుల్ రోడ్డు చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అసంపూర్తిగా ఉన్న శారదా బ్రిడ్జిని పూర్తి చేసి 15 గ్రామాల ప్రజలకు రహదారి ఇబ్బంది లేకుండా చేసిన ఘనత తమదేనని ఆయన అన్నారు. విద్యకు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి 44కోట్ల 80లక్షల రూపాయలు మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయాన్ని కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా 14.50లక్షల రూపాయల నిధులతో 250 పడకల ఆసుపత్రిగా చంద్రబాబు సహకారంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ సహకారంతో అన్ని గ్రామాలలో ఎల్‌ఈడీ వెలుగులతో నింపడం జరుగుతుందని ఆయన అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పీలా అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆయన చేతులమీదుగా దుస్తులను అందించారు. పంచాయతీ కార్యాలయం జంక్షన్‌లో లక్ష రూపాయల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రింగులైట్‌ను ఎమ్మెల్యే పీలా చేతులమీదుగా ప్రారంభించారు. ఎంపీడీవో టీవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కుసుమ భాస్కర్, హౌసింగు డీఈ ధనుంజయ్, సర్పంచ్ మేడిశెట్టి రాధ, ఎంపీటీసీలు గైపూరి క్రాంతి, చొప్పా క్రాంతి, టీడీపీ నాయకులు మేడిశెట్టి నూకరాజు, ఆర్‌ఈసీఎస్ విశ్రాంత ఎండీ దావుద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. ఆడపిల్లలని బాగా చదివించి వారిని ప్రయోజకులను చేయడం వలన మనకు గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మాకవరం గ్రామ పంచాయతీ వద్ద జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సంక్రాంతి పండగ తరువాత ప్రతీ గ్రామంలో రోడ్లు నిర్మించడం జరుగుతుందని, ఉగాదికి గ్రామాలలో ఉన్న ప్రతీ పనిని పూర్తి చేస్తామన్నారు. మాకవరం నుంచి పాపయ్యపాలెం వరకు వెళ్లే రోడ్డును కోటి పది లక్షలతో నిర్మించామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మూర్తి

గ్రామంలో మిగిలిన 29 మందికి ఉగాదికి పింఛన్లు వచ్చేలా చూస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతీ పథకాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని, గ్రామాలలో ఉన్న సమస్యలకు అర్జీలు పెట్టుకుంటే వెంటనే అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. జలసిరి నీటిని త్వరలోనే ఏర్పాటు చేస్తామని, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల మరమ్మతులకు, కుర్చీలకు, బెంచీలకు రూ.44కోట్ల 80లక్షలు నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాలకు 24గంటలూ కరెంటు ఇస్తున్న ఘనత చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. అనంతరం చంద్రన్న కానుకలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ శెట్టి వెంకటరమణ, సర్పంచ్ తమిసిడిబిల్లి లక్ష్మి, స్పెషలాఫీసరు శోభ, తహశీల్దార్ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీను, అన్ని శాఖల అధికారులు, తెలుగుదేశం నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాడుగులలో.. తెలుగుదేశం ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నదని మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు.


విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే పీలా

బుధవారం ఉదయం మాడుగుల జిల్లా పరిషత్ పాఠశాలలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. రాష్ట్రం అప్పులలో ఉన్నా వెనుకడుగు వేయకుండా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన 18 ట్రాక్టర్లను, ఒక వరి నూర్పిడి యంత్రాన్ని మంత్రి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, అంగర రామ్మోహనరావు, మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ లాలం భవానీ, నియోజకవర్గ స్పెషలాఫీసర్ జి.గోవిందరాజులు, మండల స్పెషలాఫీసర్ కె.శైలజ, ఎంపీడీవో ఎస్.డేవిడ్, తహశీల్దార్ ఎల్.రామారావు, ఎంపీపీ ఓంద్రు గంగమ్మ కృష్ణ, సర్పంచ్ దంగేటి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పెరుమాళ్ల వెంకటరావు, రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, మండల టీడీపీ అధ్యక్షుడు మజ్జి రామారావు, సీడీసీ చైర్మన్ మజ్జి తాతబాబు, ఎంపీటీసీలు ఉందూరి దేముడు, గంది దేవి, సందారపు సన్యాసిరావు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. మండల కేంద్రం సబ్బవరం సీతారామా కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ పేదల కోసం ఆలోచించిన భారదేశంలో ఎవరైనా ఉన్నారంటే అదే ఒక తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావేనని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా చేపట్టిన తరువాత పేదల కోసం కిలో బియ్యం రెండు రూపాయల పథకం చేపట్టిన ఘనత ఆయనిదేనన్నారు. అప్పట్లో రైతుల కోసం, పేదల కోసం, విద్యార్థులకు, గ్రామాల అభివృద్ధికి ఆలోచించి ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ అమలులో ఉన్నాయన్నారు. అనంతరం అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమం ద్వారా పేదలకు ఇళ్లు, చదువుకునేవారికి స్కాలర్‌షిప్‌లు, ప్రతీ గ్రామానికి సీసీరోడ్లు, తాగునీరు, రేషన్‌కార్డులు వంటి పథకాలను అందిస్తున్నారన్నారు.. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బండారు అప్పలనాయుడు, సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీను, జెడ్పీటీసీ గేదెల సత్యనారాయణ, ఆర్‌ఈసీఎస్ చైర్‌పర్సన్ కొటాన అప్పారావు, ఈస్ట్‌కోస్టు రైల్వే మెంబరు గవర శ్రీను, స్పెషలాఫీసరు శాస్త్రి, తహశీల్దార్ రామారావు, ఎంపీడీవో బాబూరావు, ఈవోఆర్డీ ఆర్ఆర్‌కె నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ గంది దేముడు, దొడ్డి ప్రకాష్, ఉపాధ్యాయుల ప్రతినిధి రమణ మాస్టారు, కోరాడ శ్రీను, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

20న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: పట్టణంలోని వేల్పులవీధి శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 20న ఘనంగా నిర్వహించబడునని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతులమీదుగా బుధవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు దొమరౌతు రామారావు, నల్లల దేముళ్లు, మద్దాల కూర్మారావు, బొడ్డపు ప్రసాద్, గొర్లి శేఖర్, వాకాడ కోటి తదితరులు ఉన్నారు.


గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పీలా

ఘనంగా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
పట్టణంలోని రవీంద్రభారతి స్కూలులో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన రకరకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. వాటిలో రైతులు, గ్రామీణ మహిళ, ఎద్దులబళ్ళు, హరిదాసుల వేషధారణలో, సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సాగర్ మాట్లాడుతూ భారత దేశంలో సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగ గురించి వివరించారు. భోగిరోజున భోగి మంటల ద్వారా చీకటిని పారద్రోలి వెలుగులు జీవితాలలో నింపాలని, సంక్రాంతి రోజు రంగవల్లులు గొప్పదనం, మన సాంస్కృతి, పొంగలి తదితర వంటకాలను వివరించారు. పాఠశాల ఆవరణ అంతా మామిడి తోరణాలతో అలంకరించి రంగవల్లులు వేసి భోగి మంటలు వేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ రవికుమార్, డీఐ మూర్తి, జోనల్ డీన్ వసంత, జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమితో ఒరిగిందేమీ లేదు

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్: రచ్చబండ,పల్లెనిద్రలో భాగంగా వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం ధర్మశ్రీ మంగళవారం రాత్రి మండలంలోని మల్లాం, అప్పంపాలెం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం గ్రామాలలో పర్యటించారు.ఆయా గ్రామాలలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి వలన ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వైకాపా సర్పంచ్‌లున్న గ్రామాలలో తేదేపా నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇందుకు నిదర్శనం ఆర్.శివరాంపురమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కె.అచ్చింనాయుడు, మరిసా అప్పలనాయుడు, దేగల అచ్చింనాయుడు, నమ్మి అప్పలరాజు, జొన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్:
మండలంలోని విజయరామరాజుపేట పాలకేంద్రంలో విశాఖడెయిరీ సభ్యరైతులకు బుధవారం పండుగ బోనస్‌ను పంపిణీ చేశారు.318 మంది రైతులకు రూ.3.59లక్షల నగదును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాణ్యమైన పాలను సరఫరా చేయడం ద్వారా డెయిరీ అందించే సంక్షేమ పథకాలను పొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి కిషోర్, పాలసంఘం అధ్యక్షుడు మళ్ల వెంకటరావు,సూపర్‌వైజర్లు బి.వెంకటప్పారావు, బి.కమలాకరరావు, వేతన కార్యదర్శి బి.ప్రసాద్, సిబ్బంది,డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎంత నల్లధనం బయటకొచ్చిందో చెప్పాలి

కె.కోటపాడు, న్యూస్‌లీడర్ : ప్రతిపేదవాడి ఖాతాల్లో15లక్షలు జమచేసేందుకు విదేశాల్లోని మనదేశ నల్లధనాన్ని వెనక్కిరప్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొండిచేయి చూపారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.జె.స్టాలిన్ అన్నారు. మండలం లో దాలివలస గ్రామంలో మండల సీపీఐ ఐదోమహాసభ జరిగింది. ఈసభను వలస గ్రామాల బడుగువర్గానికి చెందిన దమ్ము దేముడు పార్టీ జండాను ఎగురవేసి ప్రారంభించారు. ఈసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టాలిన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నోట్లరద్దుచేసి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేశారన్నారు. నోట్లరద్దుమూలంగా ఎంత నల్లధనం బయటకొచ్చిందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నరేంద్రమోడీకి 2019 ఎన్నికల్లో కోలుకోలేని తీర్పు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ కోరారు. ఈసభలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు, సహాయ కార్యదర్శి గొర్లె దేముడుబాబు, దేవరాపల్లి మండల మహిళా కార్యదర్శి లెక్కల లక్ష్మి తదితర్లు మాట్లాడుతూ పార్టీ పోరాటాలను వివరించారు. సభలో పొంతపల్లి రామారావు, వర్రిచినరమణ, సీమునురు సూర్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

వివేకానందున్ని ఆదర్శంగా తీసుకోవాలి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని వివేకానంద హాలులో శ్రీవివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 155వ జయంతి ఉత్సవాలు సందర్భంగా పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత చరిత్ర గురించి, జాతికి వారిచ్చిన సందేశం అనే అంశంపై బుధవారం సందేశాత్మక ప్రసంగం ఏర్పాటు చేశారు. ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, కార్యదర్శి డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన ప్రముఖ ప్రవచకులు రామకృష్ణానంద ప్రసంగిస్తూ స్వామి వివేకానందుడు గొప్ప దేశభక్తుడన్నారు. వివేకానందుని ప్రసంగాలు స్వాతంత్ర్య సముపార్జనలో ఎంతో మంది నాయకులకు ప్రేరణ ఇచ్చాయని తెలిపారు. వారు స్థాపించిన వివేకానంద మిషన్ ద్వారా ఆసుపత్రులు, దేవాలయాలు, అనాథాశ్రమాలు స్థాపించి పేద ప్రజలకు, అభాగ్యులకు సేవలందిస్తున్నారని తెలిపారు.

అనధికారిక ఫ్లెక్సీలు తొలగింపు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: పట్టణంలోని అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను జీవీఎంసీ ఏసీపీ అమ్మాజీరావు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం తమ సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగు సిబ్బంది అబ్బులు, నూకరాజు, గంగరాజు తదితరులు ఉన్నారు.

16న బౌద్ధమేళా

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: ఈ నెల 16న జరిగే సాయంత్రం ఐదు గంటలకు తుమ్మపాల బొజ్జన కొండవద్ద విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బౌద్ధ మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి బల్లా నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల గౌతమ్ చేతులమీదుగా విడుదల చేశారు. అదే రోజున భారత శాంతి ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు మద్దుల బాబు తదితరులు పాల్గొనారు.

అర్ధరాత్రి దాటాక చిత్ర ప్రదర్శనలు రద్దు చేయాలి

బ్లాక్‌లో అమ్మకాలకు కళ్లెం వేయాలి

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నిసిగ్గుగా అర్ధరాత్రి దాటాక 'అజ్ఞాతవాసి' చిత్రం ప్రత్యేక ఆటలు ప్రదర్శనకు అనుమతి ఇవ్వడం సమంజసం కాదని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ధ్వజమెత్తారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. గతంలో అర్ధరాత్రి చిత్ర ప్రదర్శనలు, ప్రీమియర్ షోల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నాయని ప్రభుత్వం రద్దు చేసిందని, అయితే మళ్లీ అర్ధరాత్రి చిత్ర ప్రదర్శనలను పునరుద్ధరించడం సిగ్గుచేటన్నారు. కాగా పదవ తేదీ నుంచి 17వ తేదీ వరకు అర్ధరాత్రి దాటాక ఒంటి గంట నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు చిత్రం ప్రత్యేక ప్రదర్శనలకు రాష్ట్ర హెూం శాఖ ఉత్తర్వు (మెమో నెం. 3829/జనరల్.ఏ/ఏ2/2017 తేది : 8-1-2018) జారీ చేయడం శోచనీయమన్నారు. అర్ధరాత్రి దాటాక కారణం లేకుండా రోడ్లపై తిరగకూడదని, నిత్యం ప్రచారం చేసే పోలీస్ శాఖను పర్యవేక్షించే హెూం శాఖే ఈ ఉత్తర్వు జారీ చేయడం విచారకరమన్నారు. అర్ధరాత్రి చిత్రప్రదర్శనలను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు పెచ్చరిల్లే ప్రమాదం లేకపోలేదన్నారు. సినిమా టికెట్ల బ్లాక్‌లో అమ్మకాలను నిరోధించాలన్నారు. కొన్ని థియేటర్ల యాజమాన్యాలు బుకింగ్ కౌంటర్‌లో విక్రయించాల్సిన టికెట్లను బ్లాక్‌లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయని ఆరోపించారు. తక్షణం అర్ధరాత్రి దాటాక చిత్ర ప్రదర్శనలను రద్దు చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. ప్రేక్షకుని భద్రతే సినిమా థియేటర్ల పరమావధిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎంఆర్పీ కంటే అధికంగా అమ్మకాలు చేసే సినీ థియేటర్ల యాజమాన్యాలపై తూనికలు కొలతల శాఖ దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సినీ థియేటర్లలో ఒకే రకం వస్తువుకు వేర్వేరు ధరలకు విక్రయించడం చెల్లదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సినిమా థియేటర్లలో వాహనాల పార్కింగ్ పేరుతో జరుగుతున్న దోపిడీని అధికార యంత్రాంగం అరికట్టాలని వెంకటరమణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

జె.గేట్ ఆన్‌లైన్ జర్నల్స్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న శ్రీనివాస్

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
పట్టణంలోని దైట్ ఇంజనీరింగు కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రెరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్సు, ఇన్‌ఫర్మేటిక్స్ పబ్లిషింగ్ ఇండియా లిమిటెడ్ బెంగుళూరు వారి ఆధ్వర్యంలో జె-గేట్ ఆన్‌లైన్ జర్నల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జె-గేట్ రీసోర్సుపర్సన్ సౌత్ ఇండియా మిస్టర్ ఎం.ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్ జర్నల్స్ చదివి వాటిని విద్యార్థులు వారికి సంబంధించిన సబ్జెక్టులలో వాటిని ఏవిధంగా ఉపయోగించాలి, తద్వారా విజ్ఞానాన్ని ఎలా పెంచుకోవాలో అని సూచించారు. అదే విధముగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచాలు బాటలు వేసే రూపంలో విద్యార్థుల పాత్ర కీలకమని, విద్యార్థులు ప్రతిభావంతులుగా, ఇతర దేశాల వారీతో పోటీ పడాలంటే ఇ-రీసోర్సెస్ ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన సూచించారు. ఆన్‌లైన్ జర్నల్స్‌పై అవగాహన పెంచుకోవడము వలన నూతన రంగములో ఉండే పరిజ్ఞానాన్ని పెంచుకొని వారికి సంబంధించిన రంగాలలో ఉపయోగించినట్లయితే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఆన్‌లైన్ జర్నల్స్ అవగాహన సదస్సుల వలన ముఖ్యంగా రూరల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ ప్రభాకరరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కె.రామారావు, లైబ్రేరియన్ యు.మహేష్, కె.విజయకుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా ధర్నా

కె.కోటపాడు, న్యూస్‌లీడర్ :
సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో కె.కోటపాడు తాలూకా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించడానికి అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు 'పెన్షన్ సాధన సమితి'గా ఏర్పడి ఈధర్నా చేశారు. ఏపీఎన్జీఓల సంఘం కె.కోటపాడు తాలూకా అధ్యక్షుడు జవ్వాది సన్యాసిరావు (చిన్న) ఆధ్వర్యంలో జరిగిన ఈధర్నాలో మండల పి.ఆర్.టి.యు.అధ్యక్షుడు కన్నూరు అప్పలనాయుడు, మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు సూరెడ్డి శ్రీనివాసరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, జగన్నాథరావు, పవచాయతీరాజ్‌శాఖనుండి వర్మ, మహిళాఉద్యోగులు, ఉపాధ్యాయులు,వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తదితర్లు పాల్గొన్నారు.



ధర్నాచేస్తున్న ఉద్యోగసంఘాల ప్రతినిధులు

గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తా :ఎమ్మెల్యే బూడి

మాడుగుల, న్యూస్‌లీడర్:
మాడుగుల మండలంలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని మాడుగుల శాసన సభ్యులు బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రావిపాలెం, రాజంపేట, గొప్పూరు, తాటిపర్తి గిరిజన గ్రామాలలో గిరిజనులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది గిరిజనులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడంలేదని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. అధికారులతో మాట్లాడి పింఛన్లు, రేషన్‌కార్డు, ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు లభించేవిధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. రహదారి సౌకర్యం లేదని గిరిజనులు ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడుకు తెలియజేశారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కారం జరగాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని, వెంటనే గిరిజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కొంతమంది నిరుపేద గిరిజనులకు ఎమ్మెల్యే బూడి ఆరువేల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూడి

రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సమస్యలన్నింటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాళపురెడ్డి రాజారామ్, గొల్లివిల్లి సంజీవరావు, పెదబాబు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.